



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





ఏఐ తరగతులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఏఐతో విద్యాబోధన సులభం

- పైలట్ ప్రాజెక్టుగా ఏడు పాఠశాలల్లో అమలు
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

6



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

‘ఎస్‌హెచ్‌జీ’ల ద్వారా బంకులు

- ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

6



గలగలా గోదారి

తరలి వచ్చే వేళ..

- సీతారామ కాలువల్లో గోదావరి జల పరవళ్లు
- నేడు రాజీవ్ లింక్‌కెనాల్‌కు చేరిక
- అక్కడినుంచి ఎన్నెస్పీ కాల్వకు..
- అనుసంధానించేందుకు యద్ధప్రాతిపదికన పనులు
- ఏన్కూరు లింక్‌కెనాల్‌కు నేడు మంత్రి తుమ్మల నీటి విడుదల

నీటిని ఎన్నెస్పీ కాలువకు తరలించేందుకు ఏర్పాటు చేసిన మోటార్లు



ఖమ్మం(ఆంధ్రజ్యోతిప్రతినిధి)/జూలూరుపాడు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండే ఎండలకు ఎండిపోతున్న పైర్లు... వడబడిపోతున్న వరి, మొక్కజొన్న పంటలకు గతంలో ఎన్నడు లేని విధంగా ఈసారి గోదావరి జలాలతో ప్రాణం అందబోతోంది. సీతారామ ఎత్తిపోతల పథకం మూడు లిఫ్టులనుంచి నీరు విడుదల చేయడంతో కాలవల్లో గోదావరి జలాలు గలగలా ప్రవహిస్తున్నాయి. బుధవారం ఏన్కూరు లింక్‌కెనాల్ నుంచి వైరా రిజర్వాయర్‌కు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీటి విడుదల చేయనున్నారు. సాయంత్రానికి గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌కు చేరబోతున్నాయి. సాగర్ ఆయకట్టుకు గోదావరి నీరు అందనుంది. సీతారామ కాలువవెంట గోదావరి జలాల పరవళ్లతో పరివాహక ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి తుమ్మల దశాబ్దకాలంగా సాగించిన భగీరథ ప్రయత్నానికి ప్రశంసలు అందుతున్నాయి. గోదావరి జలాలకు దారిపొడవునా రైతులు పూజలు చేస్తున్నారు. సోమవారం మంత్రి తుమ్మలనాగేశ్వరావు అశ్వాపురం మండలం బీజీకొత్తూరు, పూసుగూడెం, కమలాపురం ఎత్తిపోతల పథకాల ద్వారా గోదావరి జలాలు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల విడుదల చేసిన విషయం తెలిసిందే.. ప్రస్తుతం మూడులిఫ్టులు ప్రారంభం కావడంతో సీతారామ కాలువల వెంట భూగర్భజలాలు కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. సుమారు 100.25 కి.మీ పొడవున సీతారామ ప్రధాన కాలువ నిర్మించి ఉంది. మంగళవారం రాత్రికి 80కి.మీలకు పైగా గోదావరి జలాలు ప్రవహించాయి. ప్రస్తుతం సీతారామ కాలువలో 1,500క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. జలాలు బుధవారం ఉదయం జూలూరుపాడు మండలం వినోభానగర్‌వరకు చేరుకోనున్నాయి. అక్కడ గేట్లు అమర్చడంతో అక్కడి నుంచి ఏన్కూరు లింక్‌కెనాల్‌కు నీటి విడుదలకు సిద్ధం చేశారు. 8.60కి.మీ రాజీవ్ లింక్‌కెనాల్‌లో గోదావరి జలాలు ప్రవహించి ఏన్కూరు సాగర్ కెనాల్‌లోకి చేరతాయి. ప్రస్తుతం సాగర్‌కాలువల 2600క్యూసెక్కుల సాగర్ నీరు ప్రవహిస్తోంది. దీనికి గోదావరి అదనంగా 1,500క్యూసెక్కుల గోదావరి జలాలు జతకానున్నాయి.

నేడు నీరు విడుదల చేయనున్న మంత్రి తుమ్మల

జూలూరుపాడు మండలంలోని వినోభానగర్ వద్ద నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ రాజీవ్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి బుధవారం ఉదయం 9గంటలకు నీరు విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే గంగా హారతి కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొంటారు. నీటి విడుదల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఖమ్మంలో రేపు జాబ్‌మేళా

- జిల్లా ఉపాధి అధికారి మాధవి

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు గురువారం ఉదయం 10:00 గంటలకు ఖమ్మం నగర పరిధిలోని టేకులపల్లి మోడల్‌కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ)లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని వైఎస్కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అసెంబ్లింగ్ ఆపరేటర్, టెక్నికల్ టీమ్ సపోర్ట్, క్వాలిటీ చెకర్స్ పోస్టుల ఖాళీల కోసం ఎస్సెస్సీ, ఐ.టి.ఐ, ఏదైనా డిగ్రీ (పాస్, ఫెయిల్) అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి రూ.16వేల వేతనం ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లోని జీజే. సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ ఖాళీల కోసం ఏదైనా డిగ్రీ అర్హత ఉండి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వేతనం రూ.13వేలు ఉంటుందన్నారు. మొత్తం 500ఉద్యోగ ఖాళీల భర్తీకి ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు విద్యార్హత పత్రాల జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారి తెలిపారు.

అడవి తల్లీ సల్లంగ చూడమ్మా..

- కందిపాడు అడవుల్లో అమ్మతల్లి పండుగ

6



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

డీసీసీబీలో క్యూఆర్ కోడ్ సేవలు

- ఆవిష్కరించిన చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు

6

ఖమ్మం వ్యవసాయం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కేంద్ర సహకారబ్యాంక్ ప్రధాన కార్యాలయంలో క్యూఆర్‌కోడ్ ఆధారిత సేవలను ప్రారంభించారు. బ్యాంక్ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో క్యూఆర్‌కోడ్ సేవలను ఆవిష్కరించారు. ఈ సదుపాయంతో వినియోగదారులు, రైతులు, వ్యాపారులకు నగదు బదిలీ సులభతరం కానున్నది. సమావేశంలో బ్యాంక్ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంకులో ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. బ్యాంక్ వినియోగదారులకు

‘ప్రసాద్’ పనులు నత్తనడకన

- గడువు దాటినా పూర్తికాని డార్మెట్రీ, మిథిలా స్టేడియం షెడ్ల నిర్మాణం
- ఇప్పటికే మూడుసార్లు గడువు పొడిగింపు.. ఆరు నోటీసులు
- మరో నెలరోజుల్లో భద్రాద్రి శ్రీసీతారాముల కల్యాణం
- అప్పటిలోగా పనులు పూర్తికావడంపై అనుమానాలు

6



కేఎంసీలోని ఎల్‌ఆర్‌ఎస్ విభాగంలో దరఖాస్తుదారుల రద్దీ

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ.. కేఎంసీకి పెరిగిన తాకిడి

25శాతం తగ్గింపుతో దరఖాస్తుదారుల వెల్లువ

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): భూముల క్రమబద్దీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం రాయితీలను ప్రకటించటంతో మంగళవారం ఖమ్మం నగరపాలక సంస్థకు ప్రజల తాకిడి పెరిగింది. 31 వరకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించే వారికి 25శాతం తగ్గింపును ప్రభుత్వం ప్రకటించింది. దీంతో దరఖాస్తుదారులు ఖమ్మం నగరపాలక సంస్థలోని ఎల్‌ఆర్‌ఎస్ కౌంటర్‌కు క్యూ కడుతున్నారు. కేఎంసీ అధికారులు కూడా ఆ మేరకు దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేశారు. ఎల్-1, ఎల్-2 పరిశీలన ఏకకాలంలో పూర్తి చేసేలా ఇరిగేషన్, రెవెన్యూ, కేఎంసీ విభాగాల అధికారులతో 14 బృందాలను ఏర్పాటు చేశారు.

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా

- ఖమ్మం ప్రధాన కూరగాయల మార్కెట్‌లో అక్రమ కట్టడాలు
- రోజురోజుకూ పెరుగుతున్న అనుమతిలేని షెడ్ల నిర్మాణాలు
- మార్కెట్ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు
- ఆక్రమణల తొలగింపునకు అధికారుల వెనకడుగు

వివరాలు : 7లో



సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- తొలిరోజు ఫస్టియర్ విద్యార్థులకు నిర్వహణ
- ఖమ్మం జిల్లాలో 72 కేంద్రాలు..
- భద్రాద్రి జిల్లాలో 36 కేంద్రాలు ఏర్పాట్లు

వివరాలు : 6లో

ఖమ్మం ఖానాపురంహవేలి/చుంచుపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించే ఈ పరీక్షల కోసం ఉమ్మడి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో 72పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ జిల్లాలో మొత్తం 36,660 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా వారిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 17,783మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 18,877 మంది ఉన్నారు. పరీక్షల పర్యవేక్షణకు 3 ఫ్లయ్యింగ్ స్క్వాడ్ బృందాలు, 5సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 72 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, 72 మంది చీఫ్ సూపరిండెంట్‌లను నియమించారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు సారథ్యంలో వివిధ శాఖలకు చెందిన అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఎదురైతే సహాయం అందించేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ 9948904023ను ఏర్పాటు చేశారు.

ఉత్పత్తి లక్ష్య సాధనలో సింగరేణి ఎదురీత

- ఈ ఆర్థిక సంవత్సరంలో 42.25లక్షల టన్నుల వెనుకబాటు
- కొన్ని ఏరియాల్లో ఇప్పటికే లక్ష్యం పూర్తి

ఇల్లెందు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ ఏటా లాభాల బాటలో సాగుతున్న సింగరేణి కాలరీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యసాధనలో ఎదురీదుతోంది. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యాలు సాధించటానికి సింగరేణీ యాజమాన్యం స్పెషల్ నగదు ఇన్సెంటివ్ స్కీం సైతం ఫిబ్రవరి, మార్చి మాసాలకు అమలు చేసింది. ఉత్పత్తి లక్ష్యాలు సాధించడానికి రెండునెలల కాలానికి నగదు ప్రోత్సాహకాలు ప్రకటించింది. కాగా ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి మాసాంతానికి నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలు చేరుకోకపోవడం గమనార్హం.

2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి మాసాంతానికి శ్రీరాంపూర్ ఏరియా ఉత్పత్తి లక్ష్యం 57.45లక్షల టన్నులు కాగా 49.57లక్షల టన్నులు, మందమర్రి ఏరియాలో 32.06లక్షల టన్నులకు 24.53 లక్షల టన్నులు, బెల్లంపల్లి ఏరియాలో 33.80 లక్షల టన్నులకు 32.07 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించగలిగారు. అయితే అడ్రియాల ప్రాజెక్ట్ ఉత్పత్తి లక్ష్యం 3.92 లక్షల టన్నులు కాగా 3.95 లక్షల టన్నులు, ఇల్లెందు ఏరియాలో 35.85 లక్షల టన్నులు కాగా 39.42 లక్షల టన్నులు సాధించి 100శాతం ఉత్పత్తి లక్ష్యాలు సాధించగలిగాయి. కాగా భూపాలపల్లి ఏరియాలో 43.21 లక్షల టన్నులకు 31.88లక్షలటన్నులు, రామగుండం ఏరియాలో 43.21 లక్షల టన్నులకు గాను 31.88 లక్షలటన్నులు, రామగుండం 1వ డివిజన్‌లో ఉత్పత్తి లక్ష్యం 44.92లక్షల టన్నులు కాగా 42.22లక్షల టన్నులు, రామగుండం 2వ డివిజన్‌లో 87.80లక్షల టన్నులు కాగా 82.95లక్షల టన్నులు, రామగుండం 3వ డివిజన్‌లో 56.42లక్షల టన్నులకు 55.57లక్షల టన్నులు, మణుగూరు ఏరియాలో 115.92 లక్షల టన్నులు ఉత్పత్తి లక్ష్యంలో 115.92లక్షల టన్నులు సాధించగలిగారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి మాంసాంతానికి సింగరేణీ కాలరీస్ ఉత్పత్తి లక్ష్యం 643.20లక్షల టన్నులు కాగా 600.95 లక్షల టన్నులు మాత్రమే సాధించింది. ఫిబ్రవరి-25 మాసాంతానికి ఉత్పత్తి లక్ష్యంలో 42.25లక్షల టన్నుల ఉత్పత్తి వెనుకబడి ఉండటం గమనార్హం. కాగా 2023-2024 ఆరిక సంవత్సరంలో ఫిబ్రవరి మాసాంతానికి నిర్ధేశిత ఉత్పత్తి లక్ష్యాల్లో 627.21 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగ్గా ఈఏడాది అదేకాలానికి 600.95 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగడం గమనార్హం.



అమ్మతల్లి పండుగ జరుపుకొంటున్న గిరిజనులు →

అడవిలో మొక్కుబడులు చెల్లించేందుకు వెళ్తున్న ఆదివాసీలు ←

అడవి తల్లీ.. సల్లంగ చూడమ్మా..

- కందిపాడు అడవుల్లో అమ్మతల్లి పండుగ
- గ్రామ శివారులో అమ్మవార్ల విగ్రహాల ఏర్పాటు
- అనారోగ్యం దరిచేరవద్దని పూజలు
- పూనకాలతో ఊగిపోయిన ఆదివాసీలు
- కిలోమీటర్ అడవిలో నడిచి మొక్కుబడులు
- కట్టుబాట్లకు ప్రాధాన్యం ఇచ్చిన అడవి బిడ్డలు
- ఆదర్శంగా కనిపించిన ఐకమత్యం

చర్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల కట్టుబాట్లు, ఆచారాలు అన్నీ అడవులతో ముడిపడి ఉంటాయి. వాళ్లు ఏపని చెయ్యాలన్నా అడవి తల్లికి మొక్కాల్సిందే. సల్లంగ చూడమ్మా తల్లీ అంటూ మొక్కులు చెల్లించుకోవాల్సిందే. చర్ల మండలం కందిపాడు అడవుల్లో మంగళవారం అమ్మతల్లి పండుగను అక్కడి ఆదివాసీలు ఘనంగా జరుపుకొన్నారు. గ్రామ శివారులో పెంకులతో ఆలయాన్ని నిర్మించారు. వారి కులదేవతలను మట్టి రూపాల్లో తయారు చేసి ప్రతిష్ఠించారు. అనంతరం ఆగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన పూజలు సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగాయి. అనంతరం ఆలయం వద్ద ఆదివాసీలు పూనకాలతో ఊగిపోయారు. స్థానికుల గుడిముందు కూర్చుని ఉంటే శివసత్తులు నృత్యాలు చేశారు. ఆదివాసీల భాషల్లో పాటలు పాడారు. మట్టితో ఎడ్లబండి, ఎద్దులు, ఎదురుతో జెట్టిని తయారు చేశారు. అనంతరం మట్టి ఎద్దులను అందులో అమర్చారు. తరువాత మేక, పంది, ఇతర వస్తువులను సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ మొక్కుబడులు చెల్లించారు. కాగా ఈ తతంగం అంతా ఆదివాసీల సంప్రదాయల ప్రకారం గ్రామపెద్దలు మడివి పుల్లయ్య, మడివి దేవయ్య, మడివి పెదబండి నిర్వహించారు. గ్రామం బాగుండాలని, ఎలాంటి అనారోగ్యం దరి చేరకుండా ఉండాలని, ముఖ్యంగా అమ్మతల్లి రాకుండా పండుగను చేస్తామని గ్రామస్థులు తెలిపారు. కాగా గ్రామ కట్టుబాట్లు, సంప్రదాయాలను కందిపాడు గ్రామస్థులు తప్పకుండా పాటిస్తారు. గ్రామంలో ఐక్యత అనేందుకు ఇదే నిదర్శనం.



ఆదివాసీ ఆడబిడ్డలు

శ్రీవారి ఉత్సవమూర్తులకు యాగశాల ప్రవేశం



యాగశాలలో ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న తుళ్లూరు దంపతులు

ఎర్రుపాలెం, మార్చి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం గ్రామంలో తూళ్లూరు వ్యవసాయక్షేత్రంలో తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతులు శాంతికల్యాణం నిర్వహించనున్న శ్రీవారి పంచలోహ ఉత్సవ మూర్తులతో మంగళవారం యాగశాల ప్రవేశం చేశారు. తూళ్లరు దంపతులు నిర్మించిన వకుళామాత స్టేడియం (శ్రీవారి కల్యాణమండపం) ఈనెల 7న శిఖరప్రతిష్ఠ అనంతరం ప్రారంభోత్సవ జరగనుంది. దీనిలో భాగంగా వేదపండితులు ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులు యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, నిర్వహించారుక. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణతో అఖండదీపస్థాపన, మండపారాధనతో శిఖర ప్రతిష్ఠ పూజలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా తుళ్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ లోకకల్యాణం కోసం నిర్వహించే స్టేడియంలో నిర్వహించే మొట్టమొదటి శ్రీవారి శాంతి కల్యాణాకిఇ భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శ్రీవారి ఆశీస్సులు పొందాలన్నారు. వకుళామాత స్టేడియం ప్రారంభోత్సవానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు వేజండ్ల సాయికుమార్, రుత్వికులు, వేదపండితులు, అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పని వేళల్లో మార్పులు చేయండి

- వేసవిలో అప్రమత్తంగా ఉండాలి
- ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ



కూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వైరా, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ సూచించారు. మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో మంగళవారం క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలతో కలిసి నేలపై కూర్చొని ముచ్చటించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న సేవలు, ప్రభుత్వ పాఠశాలల్లో వస్తున్న మార్పులు తదితర అంశాలను ఉపాధి కూలీలకు శ్రీజ వివరించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా జాగ్రత్తగా ఉండాలని పలు సూచనలు చేశారు. ఎండల తీవ్రత వలన ఉపాధి హామీ పని వేళల్లో మార్పులు చేయాలని ఈజీఎస్ అధికారులను ఆమె ఆదేశించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల వద్ద అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పని ప్రదేశాల మధ్య చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలని, అవసరమైన మేర నీరు తాగడం, గొడుగు తీసుకొని బయటకు రావడం, వడగాల్పుల సమయంలో ఇంట్లో ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బౌద్ధ క్షేత్రాల్లో బ్రాహ్మణ క్రతువులను నిషేధించాలి

- బౌద్ధ భిక్షువులు సద్దా రక్కిత, ప్రజ్ఞానంద



మాట్లాడుతున్న బౌద్ధ భిక్షువులు సద్దా రక్కిత, ప్రజ్ఞానంద

నేలకొండపల్లి, మార్చి4(ఆంధ్రజ్యోతి): బౌద్ధ క్షేత్రాల్లో బ్రాహ్మణ పూజారుల క్రతువులను వెంటనే నిషేధించాలని, బౌద్ధ సంప్రదాయాలకు మద్దతుగా ప్రభుత్వాలు నడుచుకోవాలని బౌద్ధ భిక్షువులు సద్దా రక్కిత, భిక్షు ప్రజ్ఞానంద డిమాండ్ చేశారు. మంగళవారం నేలకొండపల్లిలోని అత్యంత ప్రాచీనమైన బౌద్ధ క్షేత్రాన్ని సద్దా రక్కిత, ప్రజ్ఞానంద మంగళవారం సందర్శించారు. బౌద్ధ క్షేత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. దేశంలోని ప్రాచీన బౌద్ధ కట్టడాలను పరిరక్షించి, వాటిని ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని అన్నారు. స్థానిక బౌద్ధులకు కట్టడాల నిర్వహణలో భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఈఅంశాలను సీరియస్‌గా పరిగణించాలని, బౌద్ధ క్షేత్రాల నిర్వహణలో మార్పులు చేయాలని సూచించారు. ఇదే నిజమైన ధర్మ పరిరక్షణకు దారి తీసే మార్గమన్నారు. వంగూరి ఆనందరావుమాదిగ, పగిడికత్తుల వీదయ్యమాదిగ, మాదాసు వెంకన్న తదితరులు బౌద్ధ భిక్షువుల వెంట ఉన్నారు.

మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- వ్యవసాయ శాస్త్రవేత్త శరత్‌బాబు

చర్చికంపౌండ్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని శాస్త్రవేత్త బలేజిపల్లి శరత్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం జిల్లాపరిషత్ మీటింగ్ హాల్‌లో రైతుసంఘం జిల్లామహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చి ధర పతనం కావడానికి అంతర్జాతీయ ఎగుమతులు లేకపోవడం కూడా కారణమన్నారు. మిరపకు ఈ ఏడాది ఆశించిన ధర లేక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం తీసుకొని రైతును ఆదుకోవాలని కోరారు. ఈ సదస్సులో రాష్ట్రరైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు, పోతినేని సుదర్శన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు నల్లమల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

వైద్య పరీక్షల ధరలను నియంత్రించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలో వైద్య పరీక్ష కేంద్రాల్లో ధరలను నియంత్రించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ కోరారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ప్రముఖ వైద్యులు, డయాగ్నస్టిక్ సెంటర్ యజమానులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వివిధ రకాల రక్త పరీక్షలు, స్కానింగ్లు , ఎక్స్‌రేలకు సంబంధించిన ఫీజుల నియంత్రణకు కలెక్టర్ ఆదేశానుసారం సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లలో రక్త పరీక్షలకు, అల్ట్రా సౌండ్ , స్కానింగ్, ఎక్స్‌రేలకు తీసుకుంటున్న ఫీజులను నియంత్రణ చేయాలని సూచించారు.

'ఎస్‌హెచ్‌జీ'ల ద్వారా పెట్రోల్ బంకుల నిర్వహణ

కొత్తగూడెం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా పెట్రోల్ బంకుల నిర్వహణ చేపట్టనున్నట్లు భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కొత్తగూడెం ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లాలోని పలు విభాగాల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక బృందాల ద్వారా పెట్రోల్‌బంకుల నిర్వహణ, యూడీఐసీ సదరం, పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, వేసవి ముందస్తు జాగ్రత్తలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభు త్వం మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు బ్యాంకు ద్వారా రుణాలు ఇచ్చి ప్రోత్సాహిస్తోందన్నారు. అందులో భాగంగా జిల్లాలోని స్వయం సహాయ సంఘాల ఆ ధ్వర్యంలో మహిళలు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తోందన్నారు. పెట్రోల్‌బంక్ ఏర్పాటుకు జిల్లాలో రహదారి పక్కన 10 కుంటల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సదరం శిబిరానికి వచ్చే వారికి అన్ని సదుపాయాలు క ల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటి వరకు ఐదు రకాల క్యాటగిరీ ల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేదని, కొత్తగా రూపొందించిన యూడీఐడీ పోర్టల్‌లో 21రకాల క్యాటగిరీలను చేర్చారని కలెక్టర్ వెల్లడించారు. సదరం సర్టిఫికెట్లను స్మార్టు కార్డు రూపంలో పోస్టు ద్వారా పంపిస్తారని తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని జా గ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటి ఆవరణ లో ఇంకుడు గుంతలు నిర్మించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నా రు. శిధిలావస్థలో ఉన్న పాఠశాలలను గుర్తించి త్వరితగతిన నివేదిక లు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ధరణి మాడ్యూల్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. వీడి యో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల కలెక్టర్ విద్యాచందన, జిల్లా వైద్యశాఖాధికారి భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి భద్రాద్రి రామాలయ..
మాస్టర్ ప్లాన్‌కు కసరత్తు

భద్రాచలం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచల సీతారామచంద్రస్వామి వారి ఆలయ మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు మరోసారి కసరత్తు చేపడుతున్నారు. దేవస్థానానికి ఇప్పటి వరకు అధికారికంగా ఎటువంటి మాస్టర్ ప్లాన్ లేకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో ఆ ప్రభావం పడుతోంది. సీఎం లేదా గవర్నర్ ఇతర ప్రముఖులకు ఆలయ అభివృద్ధి పనుల కోసం విన్నవించే సమయంలో మాస్టర్ ప్లాన్ ఎంతో అవసరం ఉంటుంది. దీంతో ఇటీవల దేవస్థానం అధికారులు మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై దృష్టిసారించారు. ఈ క్రమంలో ఇప్పటికే పలుమార్లు ఆలయ పరిసరాల్లో వివరాలను సేకరించి డిజైన్లను రూపొందించగా తాజాగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఉన్న చుట్టు కొలతలను సైతం సేకరించారు. భవిష్యత్తులో రామాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా చుట్టు ఆలయాలు, చిత్రకూట మండపం తొలగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇందుకోసం ఇప్పటికే 43 ఇళ్లను సేకరించేందుకు సర్వే చేయడం సంబంధిత ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేయడం జరిగింది. గతంలో 2017లో మాస్టర్‌ప్లాన్‌ను పూర్తయ్యిందని ఆనాటి సీఎం కేసీఆర్ ఆమోదమే తరువాయి అని అధికార వర్గాలు పేర్కొనగా ఆ అంశం అటకెక్కింది. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అధికారులు కసరత్తు చేస్తున్నారు.

'ప్రసాద్' పనులు నత్తనడకన

భద్రాచలం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో భద్రాచలంలో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నాయి. మిథిలా స్టేడియం పక్కన డార్మెట్రీల పనులు గడువు ముగిసినా పూర్తికాకపోవడం గమనార్హం. బ్రిడ్జి సెంటర్, పర్ణశాలలో చేపడుతున్న పనుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. 2024అక్టోబరులో మిథిలా స్టేడియం ప్రాంగణంలో చేపట్టిన షెడ్ల నిర్మాణం ఇంకా పునాదుల స్థాయిలోనే ఉంది. ఏప్రిల్ ఆరున శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం ఇక్కడే నిర్వహించనుండగా ఆ సమయంలోపు పనులు పూర్తవుతాయా లేదా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది. వాస్తవానికి భద్రాచలం దేవస్థానం పరిధిలో తీర్థయాత్రల పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి పథకం (ప్రసాద్ పథకం) కింద చేపట్టిన పనుల్లో తొలి నుంచి నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఫలితంగా మూడుసార్లు గడువు పొడిగించినా నేటికీ అవి పూర్తికాకపోవడం కాంట్రాక్టరు, అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. ఇదిలా ఉండగా ఇప్పటికే సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆరు నోటీసులు జారీ చేశామని అధికార వర్గాలు చెబుతున్నాయి.

పనుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం..

'ప్రసాద్' పథకం కింద రూ.41.38కోట్లతో అభివృద్ధి పనులు భద్రాచలం, పర్ణశాలలో చేపట్టాల్సి ఉంది. అయితే ఈ పనుల్లో తొలినుంచి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే మూడుసార్లు గడువు పొడిగించినా ఇంకా పనులు పూర్తికాకపోవడం శోచనీయం. తాజాగా మరోసారి పనులను పూర్తి చేసేందుకు గడువును పొడిగించమని ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. 2022 డిసెంబరు 28న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, అప్పటి గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిలు ఇందుకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేశారు. అయితే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టరు 2023 జూన్‌లో ఒప్పందం చేసుకోగా ఇంతవరకు కేవలం 40శాతం పనులే పూర్తవడం గమనార్హం. భద్రాచలంలో పనుల్లో ఇంత జాప్యం చోటు చేసుకుంటుండటం భక్తులను ఆవేదనకు గురి చేస్తోంది. ఇదిలా ఉండగా మిథిలాస్టేడియం పక్కన చేపడుతున్న బహుళ అంతస్తుల నిర్మాణంలో భద్రాద్రి దేవస్థానం అధికారుల వినతి మేరకు అన్నదానసత్రం నిర్వహణకు అనువుగా మార్పులు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కాగా పర్ణశాలలో సైతం పనుల నిర్వహణలో ఇదే తీరున నిర్లక్ష్యం ఉండటంతో మరొకరికి పనులు కేటాయించి పనులు కొనసాగిస్తున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

నెల రోజుల్లో రామయ్య కల్యాణం

మరో నెల రోజుల్లో శ్రీరామనవమిని పురస్కరించుకొని ఏప్రిల్ 6న భద్రాద్రి రామయ్య కల్యాణం నిర్వహించనున్నారు. ఈ తరుణంలో మిథిలా స్టేడియంలో చేపట్టిన షెడ్ల నిర్మాణం పూర్తవుతుందా లేదా అనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. 2024లో శ్రీరామనవమి, వరదల సీజన్ ముగిసిన అనంతరం అక్టోబరులో రూ.1.69కోట్లతో మిథిలా స్టేడియంలో షెడ్ల నిర్మాణం ప్రారంభమైంది. ఈ పనులు వాస్తవానికి డిసెంబరు నాటికి పూర్తికావాలని తెలుస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికీ ఇంకా పిల్లర్ల నిర్మాణ దశలోనే ఉండటం గమనించదగ్గ విషయం.



పిల్లర్ల దశలోనే ఉన్న మిథిలా స్టేడియంలోని షెడ్లు

30నాటికి షెడ్ల నిర్మాణం పూర్తి చేయాలని గడువు విధించాం

ప్రసాద్, ఏఈ పర్యాటకశాఖ

భద్రాద్రిలో, పర్ణశాలలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో ఇప్పటికే భద్రాచలంలో పనులకు మూడుసార్లు గడువు పొడిగించాం. నాలుగోసారి అనుమతులు రావాల్సి ఉంది. అలాగే సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆరు నోటీసులు జారీ చేశాం. ఏడోసారి నోటీసు జారీ చేయనున్నాం. పర్ణశాలలో పనులు మరొకరితో చేపట్టడంతో గతంలో కంటే వేగం పెరిగింది. మిథిలా స్టేడియంలో షెడ్ల నిర్మాణం మార్చి 30నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు గడువు విధించాం.

ఏఐతో విద్యాబోధన సులభం

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (కృత్రిమ మేథ)ను వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన చేసేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఖమ్మం నగరంలోని 53వ డివిజన్ ఎన్ఎస్‌పి కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ విద్యా బోధన తీరును కలెక్టర్ మంగళవారం పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను వినియోగిస్తూ విద్యార్థులకు మంచి లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్ దక్కేలా చూడాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంచేందుకు ఏఐ సహాయంతో నూతన బోధన పద్ధతులను ప్రవేశపెట్టిందన్నారు. ఖమ్మం జిల్లాలో 7 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ముందస్తుగా పైలెట్ ప్రాజెక్టు కింద ఏఐ విద్యా బోధనను ప్రారంభించామన్నారు. ఖమ్మం అర్బన్ ప్రాంతంలో నాలుగు పాఠశాలలు, ఖమ్మం నగరంలోని ఎన్ఎస్‌సీ ప్రాథమిక పాఠశాల, మల్లెమడుగు ప్రాథమిక పాఠశాల, పాండురంగాపురం ప్రాథమిక పాఠశాల, రాజేంద్రనగర్ ప్రాథమిక పాఠశాల, నేలకొండపల్లి మండలం సింగిరెడ్డిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సత్తుపల్లి మండలం సిద్దారం, ఎన్‌టీఆర్ నగర్ ప్రాథమిక పాఠశాలల్లో ఈ బోధన ఏర్పాటు చేశామన్నారు.

ఏఐ కోర్సు ప్రతి విద్యార్థికి ప్రత్యేకంగా ఉంటుందని, విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేస్తూ దానికి అనుగుణంగా బోధన జరిగేలా కోర్సులు రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదివే విద్యార్థుల కనీస అభ్యసనా సామర్థ్యాలు పెంచేలా ఏఐను వినియోగించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎన్ఎస్‌పి పాఠశాలలో 3నుంచి 5వ తరగతిలో వెనుకబడిన 10మంది విద్యార్థులను ఎంపిక చేసి తెలుగు, గణితంలో ఏఐ ద్వారా పాఠాలు బోధించటం జరుగుతుందన్నారు. ఏఐ పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులతో మాట్లాడారు. ఏఐ ద్వారా తెలుగు చదించి వాటి అర్థాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి కె రవికుమార్, ఎంఈవో శైలజాలక్ష్మి, జీసీడీఓ తులసి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీసీసీబీలో క్యూఆర్ కోడ్ సేవలు

(5వ పేజీ తరువాయి)

పలు సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఈ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం పని చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే క్యూఆర్‌కోడ్ సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ క్యూఆర్‌కోడ్ సదుపాయాన్ని డీసీసీబీ బ్యాంక్ ఖమ్మం వినియోగదారులు తమ వ్యాపారంలో నగదురహిత లావాదేవీలకు ఉపయోగించుకుని వ్యాపార అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో బ్యాంకు పాలకవర్గసభ్యులు, బ్యాంకు సీఈవో ఎన్.వెంకట ఆదిత్య, బ్యాంక్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

భద్రాద్రి జిల్లాలో ఇలా..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 19,258మంది విద్యార్థులు ఉండగా వారిలో ఫస్టియర్ విద్యార్థులు 9,255 మంది ఉన్నారు. సెకండియర్ విద్యార్థులు 10,003మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణకు మొత్తం 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్ అధికారి హెచ్. వెంకటేశ్వరరావు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు 36మంది చీఫ్‌సూపరింటెండెంట్లు, 36మంది డిపార్టుమెంటల్ అధికారులు, 13మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు సిట్టింగ్ స్క్వాడ్, ఐదుగురు కస్టోడియన్స్ అధికారులు, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు

ఇంటర్ పరీక్షలు ఈసారి సీసీ కెమెరాల నిఘా నీడన నిర్వహించనున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. దగ్గరలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయనున్నారు. పోలీసుస్టేషన్ల నుంచి ఎస్కార్ట్ సహాయంతో ప్రశ్నాపత్రాలను నేరుగా పరీక్షా కేంద్రాలకు తరలించనున్నారు. ఈసారి నిమిషం నిబంధనను ఎత్తివేశారు. పరీక్ష ప్రారంభమైన తరువాత ఐదు నిమిషాల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తారు. పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9గంటలకు ప్రారంభమవుతుండగా విద్యార్థులు ఒక గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఉదయం 8.30నుంచి విద్యార్థులను పరీక్షాహాల్లోకి అనుమతిస్తారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇంటర్నెట్‌లో నేరుగా తమ హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆయా హాల్‌టిక్కెట్లపై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రాలను గుర్తించేందుకు హాల్‌టికెట్‌పై ఈ ఏడాది క్యూఆర్‌కోడ్‌ను ముద్రించారు. ఈ కోడ్‌ను స్కాన్ చేయటంతో పరీక్షా కేంద్రం వివరాలను, అడ్రస్‌లను చూపుతుంది. దీంతో విద్యార్థులకు కొంత ఇబ్బందులు లేకుండా ఉంటాయని అధికారులు తెలిపారు.

ఖాళీ జాగా.. వేసేయ్ పాగా..

ఖమ్మం ప్రధాన కూరగాయల మార్కెట్లో అక్రమ కట్టడాలు

రోజురోజుకూ పెరుగుతున్న అనుమతి లేని షెడ్ల నిర్మాణాలు

మార్కెట్ ఆవరణలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు

ఆక్రమణల తొలగింపునకు అధికారుల వెనుకడుగు

ఖమ్మం మార్కెట్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాపర్తినగర్‌లోని ప్రధాన కూరగాయల (హోల్ సేల్) మార్కెట్‌లోని వ్యాపారుల అక్రమ కట్టడాలతో మార్కెట్‌లో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కెట్ ఆవరణలో ఇష్టారాజ్యంగా షెడ్లు నిర్మిస్తూ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూరగాయల వాహనాలకు, మార్కెట్‌లో తమ పంట అమ్ముకోవడానికి వచ్చే రైతులకు చెందిన వాహనాలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా వ్యాపారులకు కేటాయించిన దుకాణాల వెనుక భాగంలో సైతం అనధికారికంగా ఎవరికి వారు షెడ్లు నిర్మించుకోవడంతో విశాలంగా ఉన్న మార్కెట్ ఆవరణ మొత్తం ఇరుకుగా కుంచించుకు పోయిందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. కాగా అధికార పార్టీ విధేయుడుగా చెలామణి అవుతున్న మార్కెట్‌కు చెందిన ఒక వ్యాపారి ఇటీవల రెండు రోజుల క్రితం మార్కెట్ గేటు ప్రక్కనే రవాణా వాహనాలకు ఇబ్బంది కలిగేలా పెద్ద షెడ్డు నిర్మించడానికి పూనుకోవడంతో మార్కెట్‌లోని ఒక వర్గం వ్యాపారులు అక్రమ నిర్మాణాలపై మార్కెట్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినట్లు సమాచారం. దీంతో మార్కెట్‌లో మేము కూడా ప్రత్యేకంగా షెడ్డు నిర్మించుకుంటాం.. మమ్మల్ని ఆపేది ఎవరు అంటూ మరో వర్గం పోటీ పడుతుండటంతో వ్యాపార వర్గాల్లో కొత్త వివాదం ముదురుతుందని పలువురు పేర్కొంటున్నారు.

వెనకాడుతున్న మార్కెట్ అధికారులు

ప్రధాన కూరగాయల మార్కెట్‌లో ముఖ్యంగా ముగ్గురు వ్యాపారులదే పెత్తనం. వారు మార్కెట్ యార్డులో బైపాస్ రోడ్డు వైపు ఆంజనేయ స్వామి గుడికి వెళ్లే మెయిన్‌గేటు వద్ద రూ.30 లక్షలతో నిర్మించి ఖాళీగా ఉన్న షెడ్డును ఎప్పట్నుంచో ఆక్రమించుకున్నారు. ఆ షెడ్డు మొత్తం ఆయా వ్యాపారులకు చెందిన ఖాళీ ట్రేలు మాత్రమే ఉంచాలి. ఇతర వ్యాపారులవి పెట్టనివ్వరు. అక్కడ సుమారు 15 దుకాణాలు ఏర్పాటు చేసి కొత్త వారికి లైసెన్సులు ఇస్తే ఒక్కో షాపుకు గాను రూ.5000 అద్దె అంటే మొత్తం నెలకు ప్రభుత్వానికి రూ. 75 వేలు ఆదాయం వచ్చేది. సదరు వ్యాపారులు కొత్త లైసెన్సుల జారీకి, అక్కడ దుకాణాల నిర్మాణానికి సైతం ఆ ముగ్గురు వ్యాపారులు మోకాలడ్డేస్తున్నారని ఇతర వ్యాపారులు పేర్కొంటున్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంతో మార్కెట్‌లో తమ దుకాణాల వెనుక భాగంలో సైతం ఇబ్బడి ముబ్బడిగా అక్రమంగా షెడ్లను సైతం నిర్మించుకున్నారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి కూర గాయలను తీసుకొచ్చే లారీలకు, ఇతర వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి ప్రభుత్వ ఆదాయం పెంచి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రధాన హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో నిత్యం రూ. 50 నుంచి 60 లక్షల వ్యాపారం జరుగుతుంది. ఇప్పటికే అక్కడ సుమారు 46 హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. వాటికి అద్దె సైతం నామమాత్రమే. ఒక్కో దుకాణానికి కేవలం రూ. 1600లు మాత్రమే చెల్లిస్తుంటారు. అయినా వ్యాపారుల అత్యాశకు అంతు లేకుండా పోయింది.

వారి దుకాణాల ముం దు ఇప్పటికే రేకుల షెడ్లు నిర్మించుకున్న వారు మరలా వారి దుకాణాల వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో ఆక్రమంగా షెడ్లు నిర్మించి మార్కెట్ ఆ వరణను ఇరుకుగా తయారు చేశారు. అంతేకాకుండా ప్రస్తుతం మా ర్కెట్ ఖాళీ ఆవరణలో సైతం ఎవరికి వారు అక్రమంగా షెడ్లు నిర్మిస్తూ ట్రాఫిక్‌కు భంగం కలిగిస్తున్నారు. దీంతో మార్కెట్ అధికారులు సదరు అ క్రమ కట్టడాలకు సైతం పంచాయతిరాజ్ నిబంధనల ప్రకారం అద్దెలు వసూలు చేస్తే మార్కెట్‌కు నెలకు సుమారు రూ. 50 నుంచి రూ. 60 వేల వరకు అద్దెల రూపంలో ఆదాయం సమకూరుతుంది.


మార్కెట్ ఆవరణలో వ్యాపారి నిర్మిస్తున్న షెడ్డు

కాగా మార్కెట్ అధికారులు అక్రమ కట్టడాలపై పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా అక్రమణలు చేస్తూ వారి పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఖమ్మంలో క్లాక్ టవర్

రెండు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య


క్లాక్ టవర్‌కు స్థల పరిశీలన చేస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇక ఖమ్మం నగరంలోనూ క్లాక్ టవర్ కనువిందు చేయనుంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఖమ్మంలో క్లాక్ టవర్ నిర్మాణానికి కార్యచరణ ప్రారంభించారు. మంగళవారం ఖమ్మం నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాలను పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ అభిషేక్ పరిశీలించారు. క్లాక్ టవర్ ఏర్పాటుపై సమీక్షించారు. ఇటీవల కాలంలో నల్గొండలో క్లాక్ టవర్ నిర్మాణం జరిగింది. అంతకు మించిన స్థాయిలో ఖమ్మంలో క్లాక్ టవర్‌కు అధికారులు కార్యాచరణ ప్రారంభించారు.

పేదల ఆశాకిరణం వెంకటరెడ్డి

కామేపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పేదల ఆశాకిరణం మాజీ మంత్రి దివంగత నేత రాంరెడ్డి వెంకటరెడ్డి అని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం కొత్త లింగాల క్రాస్‌రోడ్‌లో వెంకటరెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి గజమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదోళ్లకు ఇష్టమైన నాయకుడు వెంకటరెడ్డి అని, ప్రతి పేద వాని ఇంటికి వెళ్లి వారి కార్యక్రమాల్లో పాల్గొనేవాడని అన్నారు. పేద ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటాడని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాయల నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సుజాత మంగీలాల్, రాదాకిషోర్, రాంరెండి చరణ్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ యువజన నాయకులు భూక్య సురేష్, నర్సిరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, ధనియాకుల హన్మంతరావు, డీఎస్, రాంబాబు, బొడ్డులక్ష్మినారాయణ మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతో భార్యపై కత్తితో దాడి

పరిస్థితి విషమం.. ఖమ్మం ఆసుపత్రికి తరలింపు



పాల్వంచ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో భర్త కత్తితో దాడి చేసి గాయపరచిన సంఘటన పాల్వంచలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పాల్వంచ బొల్లోరిగూడెంలో నివాసముంటున్న రేగా రవీందర్ గతంలో నవభారత్ కర్మాగారంలో పని చేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఈ మధ్య కాలంలో తరచూ భార్య లక్ష్మితో గొడవపడుతున్నాడు. ఉదయం ఇంట్లోని స్కూటీ విషయంలో మళ్లీ వారి మధ్య వాగ్వాదం మొదలైంది. క్షణికావేశంలో పక్కన అద్దెకు ఉంటున్న ఆమె కత్తితో కూరగాయాలు తరుగుతుండగా ఆమె వద్దకు వెళ్లి.. ఆ కత్తితో భర్తపై దాడికి యత్నించింది. తప్పించుకుని రవీందర్ తిరిగి అదే కత్తితో ఆమెపై దాడి చేసాడు. దీంతో ఆమె కడుపులో, మెడ భాగంలో తీవ్ర గాయాలై రక్తస్రావం ఏర్పడింది. ఈ పరిణామానికి విస్తుపోయిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ముందుగా లక్ష్మిని హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు రవీందర్‌ను అదుపులోకి తీసుకుని పాల్వంచ టౌన్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం కుటుంబ సభ్యులు లక్ష్మిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తన బావ రవీందర్ ఉద్యోగం మానేసి తాగుడుకు బానిసై తన అక్కను తరచూ డబ్బుల కోసం వేధిస్తున్నాడని, ఆ క్రమంలోనే డబ్బులు తన వద్ద లేవని ఆమె చెప్పడంతో ఆమెపై కక్ష పెంచుకుని చంపడానికి ప్రయత్నించాడని బాధితురాలి చెల్లి లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ అడిషనల్ ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.

ఎంఈవోలతో ప్రత్యేక సమావేశం

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, పదోతరతి పరీక్షల నిర్వాహణపై మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ అధ్యక్షతన వరంగల్ ఆర్జేడి సత్యనారాయణరెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఎంఈవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్జేడి మాట్లాడుతూ ప్రతిఒక్క ప్రధానోపాధ్యాయుడు రోజులో ఒకటి, రెండు సబ్జెక్టుల పాఠాలు బోధించాలని, పాఠశాలలో మధ్యాహ్న భోజనం సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మార్చి 21 నుంచి పదోతరతి పరీక్షలు జరుతున్నందున ఎటువంటటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో సౌకర్యాలు కల్పించాలని, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. పాఠశాలల్లో రిజిస్టర్ మెయింటెనెన్స్ సక్రమంగా ఉండాలని, ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎంఈవోలు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ పూజ గద్దెను ధ్వంసం చేసిన వారిపై..

చర్యలు తీసుకోవాలని ఆందోళన

కారేపల్లి, మార్చి4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గిరిజన సంఘం నాయకులు ఏర్పాటుచేసిన సంత్ సేవాలాల్ పూజగద్దెలను సోమవారం గుర్తుతెలియని వారు డోజర్లతో ధ్వంసం చేశారు. సంత్‌సేవాలాల్ చిత్రపటాన్ని కిందపడవేశారని ఆరోపిస్తూ మంగళవారం పలువురు గిరిజనసంఘం నాయకులు బస్టాండ్ సెంటర్లో ఆందోళన నిర్వహించారు. పూజ గద్దెలను ధ్వంసం చేసినవారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు గంటకుపైగా రోడ్డుపై బైఠాయించి నిరసనవ్యక్త చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎన్.రాజారామ్ ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమించి స్టేషన్‌కు రమ్మని తెలిపారు. ఇంతలో కొందరు కూల్చివేసిన గద్దెలవద్దకు చేరుకుని విగ్రహాలకు పూజలు చేశారు. ఇదిలా ఉండగా సంత్‌సేవాలాల్ మహరాజ్‌కు సంబంధించిన పూజలు నిర్వహించిన భూమి ప్రభుత్వం బీసీ హాస్టల్ కోసం కేటాయించిన స్థలంలో కార్యక్రమం నిర్వహించారని, ఇది ప్రభుత్వ స్థలం అని సంబంధిత అధికారులు తెలిపారు. ప్రభుత్వ హాస్టల్ కోసం కేటాయించిన భూమిలో జయంతి వేడుకలు ఎలా నిర్వహించారని, అందుకే అధికారుల ఆదేశాల మేరకే పూజస్థలంలో గద్దెలను ధ్వంసం చేశారనే ప్రచారం సాగుతోంది. అయితే గద్దెలు ధ్వంసం చేసిన ప్రాంతంలోనే తిరిగి గద్దెలు ఏర్పాటుచేస్తామని గిరిజన సంఘం నాయకులు తెలిపారు.

సింగరేణికి బకాయిలు చెల్లించాలి

బీఎంఎస్ జాతీయ కార్యదర్శి మాధవ్ నాయక్

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ కార్యదర్శి మాధవ్‌నాయక్ డిమాండ్ చేశారు. సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని కోరారు. మంగళవారం బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణికి రూ.35,645 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. సింగరేణి సంస్థకు ఆర్థిక పరిపుష్టి సాధించడం కోసం కార్మికసంఘాలన్నీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.25వేల కోట్ల బకాయిలు ఉండగా ఇప్పుడు మరింత పెరిగిందని దీని వల్ల సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఆవేదన చెందారు.ఈ కార్యక్రమంలో బీఎంఎస్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పవన్‌కుమార్, కేంద్ర ఉపాధ్యక్షులు మొగిలిపాక రవికుమార్, ఏరియా ఉపాధ్యక్షులు ఊట్ల గ ణేష్, కార్పోరేట్ కర్యదర్శి నాగ ప్రసాద్, నాయకులు సంగం చందర్, వి. వెంకటేశ్వరరావు, లట్టి జగన్మోహన్, టీవి. సూరీ, వెంకట రెడ్డి, శ్రీనివాస్, సుందర్‌రావు, బాలకృష్ణ, శ్రావణ్‌కుమార్, రాజేష్, భాగ్యలక్ష్మి, భానుప్రియ, అనూష, జీవీ. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్ నవీన్, మరో వ్యక్తి అరెస్ట్

ఖమ్మంక్రైం, మార్చి4(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా నగరంలో పలు నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రౌడీషీటర్ ముద్దంగుల నవీన్‌తో పాటు పాతనేరస్తుడు మంజుల విజయ్‌కుమార్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం టు టౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా సోమవారం బీఆర్ఎస్ కార్యాలయం సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా నవీన్, విజయ్‌కుమార్ వారిని చూసి పారిపోయేందుకు యత్నించారు.దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా పాతనేరస్తులుగా వివరాలు తెలిపారు. గతనెల 9న ఎన్ఎస్‌పీ కాలనీలో స్కూటీపై వెళుతున్న ఓ వ్యక్తిని ఆపి బెదిరించి బ్యాగులో ఉన్న రూ.30వేల నగదు లాక్కుని పారిపోయారని, ఖమ్మంఅర్బన్ పోలీసుస్టేషన్‌లో గతనెల 14న ద్విచక్రవాహనంపై వెళతున్న ఓ వ్యక్తి కంటిలో కారం చల్లి అతడి వద్ద ఉన్న బ్యాగును అపహరించడానికి యత్నించిన కేసులో సైతం వీరిద్దరు నిందితులుగా ఉన్నారని సీఐ తెలిపారు. నవీన్ కొన్నేళ్ల నుంచి రోడ్లపై గొడవలు చేస్తూ సెటిల్‌మెంట్ పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తూ నిందితుడుగా ఉన్నాడని, హత్యాయత్నంతో పాటు సుమారు పదికేసుల్లో నిందితుడుగా ఉన్నాడని సీఐ తెలిపారు. నవీన్ గతంలో జైలుకు పోయి బెయిల్‌పై బయటకువచ్చాడని, నవీన్‌పై టుటౌన్ పోలీసుస్టేషన్‌లో రౌడీ షీట్ ఉన్నట్టు సీఐ తెలిపారు. మరో నిందితుడు విజయ్‌కుమార్‌పై కూడా 2021లో అర్బన్ పోలీసుస్టేషన్‌లో గంజాయి కేసుకూడా ఉన్నట్టు సీఐ తెలిపారు. వీరి నుంచి ఒక స్కూటీని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పేర్కొన్నారు.

బీటీపీఎస్ నిర్వాసితులకు న్యాయం చేయండి

కలెక్టర్‌కు చందా లింగయ్య వినతి

మణుగూరు/మణుగూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లుగా భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణంలో భూములు కోల్పోయి నిర్వాసితులుగా ఉన్న గిరిజన మహిళలకు, రైతులకు నేటికి ఏమాత్రం నష్టపరిహారం అందించలేదని, తగిన న్యాయం జరగలేదని పేర్కొంటూ ఆదివాసీ సంఘాల జేఏసీ జాతీయ చైర్మన్ చందా లింగయ్య దొర కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతి పత్రాన్ని అందించారు. నిర్వాసిత మహిళలు, రైతులతో కలిసి మణుగూరులో మంగళవారం పర్యటించిన కలెక్టర్‌ను తహశీల్దార్ కార్యాలయం వద్ద కలుసుకుని సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఆది వాసీ భూములను ఇతరుల పేర్లతో పహానీలు తయారు చేసి పలు అక్రమాలకు పాల్పడి నాటి వీఆర్‌ఓలు,ఎంఆర్‌ఓలు 400 కోట్ల రూపాయాలను కాజేసినట్లు పేర్కొన్నారు. దీంతో అసలైన భూమి హక్కుగల ఆదివాసీలకు దారుణమైన మోసం జరిగిందన్నారు. మణుగూరు మండలంలోని రామానుజవరం రెవెన్యూ గ్రామంలోని సర్వే నెం 853లో సుమారు 1250 ఎకరాల ఆదివాసీల భూములను అక్రమాలకు పాల్పడి ఆదివాసీలకు తీరని అన్యాయం చేశారని తెలిపారు. ఈ విషయంపై వెంటనే దర్యాప్తు చేసి దోషులను శిక్షించి దిగమింగిన సొమ్ములను రాబట్టి ఏజెన్సీ చట్టాల ప్రకారం ఆదివాసీలకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం జయగోపాల్, చిడెం నాగేశ్వరరావు, మహిళావిభాగం రాష్ట్ర నాయకురాలు కుంజా వెంకటరమణ, గొగ్గెల ఆర్కె,కొమరం శ్రీను, పాల్వంచ వెంకటేశ్వర్లు, కుంజా నాగేశ్వరరావు, మహేష్, మడి గౌతమి, ఏనిక ఉషారాణి, పూనెం విజయలక్ష్మి, ఏనిక మంగమ్మ, పొడెం నరసమ్మ, మునిగల శారద, రజిని, నాగమణి, సమ్మక్క, మమత, స్వరూప, శ్రీఉ, కుంజా సూర్యం తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ వనజీవి రామయ్యను కలిసిన..

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

ఖమ్మం రూరల్, మార్చి, 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అకాడమీ నుంచి 35వ బ్యాచ్‌కు చెందిన 40 మంది ఫారెస్ట్ ట్రైనింగ్ బీట్ ఆఫీసర్లు పద్మశ్రీ గ్రహిత వనజీవి రామయ్యను రెడ్డిపల్లిలోని తన నివాసంలో మంగళవారం కలిసారు. ఈ సందర్భంగా వనజీవి రామయ్య తన అనుభవాలను, చెట్లను ఎలా పెంచాలి, పర్యావరణాన్ని ఎలా కాపాడాలి అంశాలను క్లుప్తంగా వివరించారు. అనంతరం వనజీవి రామయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కోర్స్ డైరెక్టర్ గంగారెడ్డి, కూసుమంచి రేంజ్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, డిప్యూటి రేంజ్ ఆఫీసర్ కె.వి.రామారావు, కొండలరావు, సెక్షన్ ఆఫీసర్ డానియల్, వెంకటేశ్వర్లు, నరసింహరావు, మధు తదితరులు పాల్గొన్నారు.


రామయ్య దంపతులతో అధికారులు

సూపర్‌వైజర్, టీచర్ మధ్య గొడవ?

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని ఖమ్మం నగరంలో ఓ ప్రాజెక్టు సూపర్‌వైజర్‌కు, టీచర్‌కు గొడవ జరిగినట్లు సమాచారం. సంబంధిత ప్రాజెక్టు సూపర్‌వైజర్ తనిఖీల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్ తనిఖీ చేస్తుండగా సెంటర్ టీచర్‌కు సూపర్‌వైజర్‌కు గొడవ జరిగినట్లు తెలిసింది. దీంతో సూపర్‌వైజర్ టీచర్ తీవ్ర స్థాయిలో వాగ్వివాదం జరిగి ఒకరినొకరు నెట్టుకున్నారని, దీంతో సూపర్‌వైర్‌కు స్వల్ప గాయాలు అయినట్లు సమాచారం. గొడవ జరిగిన టీచర్‌కు సంబంధించిన కొందరు యూనియన్ నాయకులు అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకోని టీచర్‌కు మద్దతుగా నిలిచారని తెలిసింది. ఈ విషయమై వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రైవేటు కళాశాలలో ఫుడ్ పాయిజన్ ?

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఆదివారం రాత్రి ఫుడ్ పాయిజన్ జరిగి ఆరుగురు విద్యార్థులు అస్వస్తకు గురైనట్లు తెలిసింది. అస్వస్తకు గురైన విద్యార్థులను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆదివారం రాత్రి విద్యార్థులు పప్పుతో భోజనం చేశారని తెలిసింది. ఆ రాత్రి విద్యార్థులకు కడుపు నొప్పితోపాటు వాంతులు, విరేచనాలు కావటంతో కళాశాల యాజమాన్యం వెంటనే అప్రమత్తమై విద్యార్థులను ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. కాగా బుధవారం నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరుగుతుండటంతో విద్యార్థుల తల్లిండ్రులు ఆందోళనకు గురైతున్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెనుబల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన ఎడ్లబంజర గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన ఇమ్మడి భాస్కర్‌రావు(55) జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా కొత్తగూడెం నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భాస్కర్‌రావుకు తీవ్రగాయాలు కావడంతో పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు వీఎంబంజర్ ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న యువకుడి అరెస్ట్

చంద్రుగొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై గంజాయిని తరలిస్తున్న దాసరి వెంకటేశ్వరావు అనే యువకుడిని అరెస్టు చేసినట్లు చంద్రుగొండ ఎస్ఐ శివరామకృష్ణ మంగళవారం విలేకరులకు తెలిపారు. చంద్రుగొండలో వెహికల్ చెకింగ్ నిర్వహిస్తుండగా ద్వి చక్ర వాహనంతో అనుమానస్పదంగా ఉన్న యువకుడును అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా అతని వద్ద 500 గ్రాములు గంజాయి దొరికింది. చంద్రుగొండకు చెందిన యువకుడిగా గుర్తించామన్నారు. గంజాయి రవాణాలో మరి కొందరు యువకులకు సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్నామని వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు

ఇరవెండి ఎఫ్‌బీవో సస్పెన్షన్

బూర్గంపాడు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండలం ఇరవెండి ఎఫ్‌బీవో లక్పతిపై సస్పెన్షన్ వేటు పడింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో ఉన్నాతాధికారులు ఆయనను సస్పెండ్ చేశారు. ఇటీవల ఇరవెండి సెక్షన్‌లో జిల్లా ఆటవీశాఖ అధికారి కృష్ణగౌడ్ పర్యటించారు. ఇరవెండిలో పోడు నరికిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఎఫ్‌బీవో లక్పతి విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నట్లు గుర్తించి సస్పెన్షన్ వేటు వేశారు.

సాయిబాబా ఆలయంలో చోరీ..

పినపాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడూళ్ల బయ్యారం సాయిబాబా ఆలయంలో మంగళవారం చోరీ జరిగింది. అర్ధరాత్రి దాటాక సుమారు 2గంటల సమయంలో గుర్తు తెలియని ఓ అగంతకుడు గుడి తలుపులు పగులకొట్టి హుండీ ఎత్తుకెళ్లాడు. దొంగిలించిన హుండిని గుడి వెనుక ఉన్న పంట పొలాల్లోకి తీసుకెళ్లి పగులకొట్టాడు. అందులోని నగదును తీసుకుని హుండిని అక్కడే వదిలేసి పారిపోయాడు. అయితే దొంగతనం జరిగిన ఘటన గుడిలోని సీసీ కెమెరాలో నమోదైంది. గుడిలో చోరీ ఘటనపై ఆలయ అర్చకుడు అంబడిపూడి ప్రసాద్ శర్మ, కమిటీ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దర్యాప్తు చేపట్టిన సీఐ వెంకటేశ్వరరావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పొలాల్లోకి తీసుకెళ్లిన హుండీని పగులగొట్టి నగదు దోచుకుని పారిపోయినట్లు గుర్తు చేశారు. సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. నగదు ఎంత ఉంటుంది అనేది తెలియదని అర్చకుడు, కమిటీసభ్యులు తెలిపారు.

టాటా ఏస్ వాహనానికి మంటలు

ఏన్కూరు, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు గ్రామ సమీపం పల్లిపాడు రహదారిలో దూగుట్ట దగ్గర టాటా ఏసీ వాహనంకు ప్రమాదవశాత్తు మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో వాహనంలోని ఏసీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. వైరా అగ్నిమాపకశాఖ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. వాహనంలో డ్రైవర్ రమేష్ ప్రతిరోజులాగానే ఖమ్మం నుంచి 9ఏసీలు, 12 ఫ్రిజ్‌లతో కొత్తగూడెంకు బయలుదేరాడు. ఏన్కూరుసమీపంలోకి రాగానే వాహనంలో ఒక్కసారిగా పొగలు రావడానికి చూసి ప్రయాణీకులు డ్రైవర్‌కు సమాచారం అందించారు. వెంటనే డ్రైవర్ వాహనాన్ని పక్కకు ఆపి చూడగానే వాహనంనకు పూర్తిగా మంటలు వ్యాపించాయి. దీంతో వాహనంతోపాటు వాహనంలోని పరికరాలు కూలిపోయాయి. ఏసీ, ఫ్రిజ్‌ల్లోని గ్యాస్ లీకై మంటలు వ్యాపించినట్టు అనుమానిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న వైరా అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు సంఘటనస్థలాన్నిఎస్ఐ రఫీ సందర్శించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. సుమారు ఆరు లక్షల నష్టం వాటిల్లినట్టు అంచనా.


మహిళ మెడలో గొలుసు చోరీకి యత్నం

ఖమ్మంక్రైం, మార్చి4(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ మహిళ నడుచుకుంటూ వెళుతుండడగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మెడలోని బంగారు గొలుసు చోరికి యత్నించిన సంఘటన సోమవారం రాత్రి నగరంలో జరిగింది. ఖానాపురంహవేలి పోలీసుల కథనం ప్రకారం మమతారోడ్డు సమీప ప్రాంతానికి చెందిన ఉన్న లత అనేమహిళ పనిపూ ఇంటినుండి బ యటకు వచ్చి నడుచుకుంటూతిరిగి ఇంటికి వెళుతోంది. ఈ క్రమంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చీకటిలో నిలబడి మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కునే ప్రయత్నం చేశారు. దీంతో మహిళ గొలుసు గట్టిగా పట్టుకుని కేకలు వేయడంతో తెగిన బంగారు గొలుసు సుమారు 2గ్రాముల ముక్కను తీసుకుని పారిపోయారు. బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసినట్టు ఖానాపురంహవేలి పోలీసులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

భద్రాచలం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ఇందిరామార్కెట్ రోడ్డులో ఉన్న కొంజర్ల రమేష్-మంజుల ఇంట్లో మంగళవారం ఒక్కసారిగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇంట్లో నుంచి పొగలు, మంటలు వస్తుండటంతో పరిసర ప్రాంతాల వారు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ప్రమాద స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శకటం మంటలును అదుపులోకి తెచ్చింది. కాగా ఈ ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. ఈ అగ్నిప్రమాదం జరగడానికి కారణం ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూటే కారణమని తెలుస్తోంది.

బాత్రూంలో గుర్తుతెలియని మృతదేహం



భద్రాచలం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం పట్టణంలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి సంబంధించిన తానీషా కళ్యాణమండపం సీఆర్ వో ఆఫీస్ పైన పబ్లిక్ డార్మెటరీ బాత్‌రూమ్‌లో మంగళవారం ఒక గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. బాత్రూమ్‌లో మృత దేహం ఉన్న విషయం దేవస్థానం సిబ్బంది పోలీసులకు సమాచారం అందించటంతో వెళ్లి మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలోని మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు 87126 82107 నెంబర్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

కరుణగిరిలో నేటినుంచి 'లెంట్ డేస్'

ఖమ్మంరూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): దేవుని పట్ల హృదయాంతరాల్లో అచంచల విశ్వాసం నిలిపేందుకు బుధవారం నుంచి లెంట్‌డేస్‌లో ఉపవాస దీక్షలు క్రైస్తవులు ఆచరిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఆర్‌సీఎం. బిషప్ సగిలి ప్రకాష్ తెలిపారు. పెద్దతండా పరిధిలోని కరుణగిరిలో మంగళవారం జరిగిన ఓకార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బుధవారం నుంచి 40 రోజుల పాటు తపస్సు కాలంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్నట్లు ఆయన తెలిపారు. మతగురువులు, విశ్వాసుల నుదుటపై విభూది రాసిన తర్వాత ఈ ఉపవాస దీక్షలు ప్రారంభమవుతాయన్నారు. తపస్సు కాలం ఆచరించే 40 రోజులలో ప్రతీరోజు కఠోర ఉపవాస దీక్ష ఉంటుందన్నారు.విధిగా దానధర్మాలు చేయాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాలని బిషప్ తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

తాగునీటి ఎద్దడి రావద్దు

- జంతువులకూ నీటి వనరులు ఏర్పాటు చేయాలి
- ఖమ్మంలో తాగునీటి సమస్యపై కమిషనర్ అభిషేక్ అగస్త్య సమీక్ష

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు కార్యచరణ చేసి నీటి లభ్యతను గుర్తించాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. మంగళవారం వేసవి నీటి యాక్షన్‌ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు. గత వేసవిలో తాగునీటి ఎద్దగి ఏర్పడిన ప్రాంతాలపై సమీక్షించారు. ఖమ్మంలో ఎన్ని చేతి పంపులు, తాగునీటి పథకాలున్నాయి. వాటిలో భూగర్బ జలాల తీరు, మరమత్తులకు గురైన పథకాలపై సమీక్షించారు. ఈ సంవత్సరం ఆయా ప్రాంతాల్లో నీటి అవశ్యకత, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆదేశించారు. తాగునీటి ట్యాంకులు ఏర్పాటును సమీక్షించారు. వీధుల వెంట కుక్కలకు, పార్కుల్లో జంతువులు, పక్షులకు తాగునీటి ఎద్దడి లేకుండా నీటి కుండలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్‌కుమార్, ఉద్యాన అధికారి రాధిక పాల్గొన్నారు.

ఒకే రోజు 200 రెడ్ నోటీసులు

భవనాల ట్యాక్స్ చెల్లింపులు జాప్యం చేసి వారికి రెడ్ నోటీసులు జారీ చేసి మూడు రోజులు తర్వాత ఆయా భవనాలను సీజ్ చేయాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. ఆదాయ వసూళ్ల స్పెషల్ డ్రైవ్‌ను కమిషనర్ ఇందిరానగర్, మమతా రోడ్డులో తనిఖీలు చేశారు. నిర్ణీత లక్ష్యం మేరకు బిల్ కలెక్టర్లు ఆదాయ వసూళ్లు చేయాలని ఆదేశించారు. ఒక్కో బిల్‌కలెక్టర్ రోజుకు 20 రెడ్ నోటీసులు చొప్పున రోజుకు 200 రెడ్ నోటీసులు జారీ చేసి ఆదాయ వసూళ్లు వేగంగా చేపట్టాలని, ఎక్కడైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం కల్పించాలి

- వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీ



జిల్లా ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి4(ఆంధ్రజ్యోతి):" వైద్యుల హాజరు ఎలా ఉంటోంది... మీరు ఎన్ని గంటలకు రౌండ్స్‌కు వెళ్తున్నారు.. ఆ సమయం తెలిసేలా వార్డుల్లో డిస్‌ప్లేకు పెట్టండి... విధులకు నిర్ధేశించిన సమయానికి హాజరుకావాలి..." అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వైద్యులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలలో విశ్వాసం కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య శాఖ సేవా దృక్పథంతో పని చేయాలని ఆయన అన్నారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులు, సరుకులు నిల్వ చేసే స్టోర్ రూమ్‌లను కలెక్టర్ పరిశీలించారు. సిబ్బంది వివరాలు, మందులు, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో పార్కింగ్, టాయిలెట్స్ నిర్మాణాల కోసం అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. మహిళా శక్తి పథకంలో భాగంగా నడుపుతున్న క్యాంటీన్‌ను కలెక్టర్ సందర్శించారు. వైద్యకోసం వచ్చే వారికి, వారి సహాయకులకు మంచి రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. సత్యసాయి సేవా అన్నదానం కార్యక్రమంలో కలెక్టర్ భోజనం వడ్డించారు. కలెక్టర్ వెంట జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్. కిరణ్ కుమార్, ఆర్ఎంవోలు బి.రాంబాబు, రాథోడ్ వినాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ తనిఖీ

ఖమ్మం మార్కెట్: మిర్చి రైతులను మోసం చేసే వ్యాపారులపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సందర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర అందేలా నిరంతరం పర్యవేక్షిస్తానని అన్నారు. మిర్చికి సరైన ధర లభించేలా నిరంతరం మార్కెట్ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.

మాతృమరణాలను నిరోధించాలి

జిల్లా వైద్యాధికారి

ఖమ్మంకలెక్టరేట్, మార్చి4(ఆంధ్రజ్యోతి): మాతృమరణాలను నిరోధించాలని జిల్లా వైద్యాధికారి కళావతీబాయి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆర్మాన్ సహకారంతో "అమ్మా కోసం " అనే అంశంపై ఏఎన్ఎంలకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. గర్భ సమయంలో మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. తద్వారా మాతృ మరణాలను తగ్గించి ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణానికి గ్రామస్థాయిలో ఏఎన్ఎంలకు పాటుపడాలని సూచించారు. గ్రామస్థాయిలో గర్భిణుల ఆరోగ్యం గురించి అవగాహన కల్పించవలసిన బాద్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, డాక్టర్ చందన,డీపీహెచ్ఎన్‌వో శేషుపద్మ, డీసీఎంఎస్ రఘురాం, డీడీఎం నాగరాజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



లా సెక్రటరీకి వినతిపత్రం అందజేత

ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి



ఖమ్మంలీగల్,మార్చి4(ఆంధ్రజ్యోతి):ఈ నెల ఒకటో తేదీన ఖమ్మంబార్ అసోసియేషన్ న్యాయవాది తాళ్లూరి దిలీప్‌చౌదరి ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ నేపథ్యంలో జరిపిన తీర్మానాలను ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై.కొండల్‌రెడ్డితో కలిసి మంగళవారం సెక్రటేరియట్‌లోని లా సెక్రటరీ రెండ్ల తిరుపతిని తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. నాన్ బేలబుల్ కేసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అపాయింట్మంట్స్ వారి పరిధి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులు తదితర అంశాలపై తీర్మానాలు చేశారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని లాసెక్రటరీ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ వైస్ ప్రెసిడెంట్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, 35బీఎన్ఎస్ఎస్ ఉద్యమ కమిటీ కన్వీనర్ తాళ్లూరి దిలీప్‌చౌదరి, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పసుపులేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోస్టల్ బీమా అందజేత



నేలకొండపల్లి,మార్చి4(ఆంధ్రజ్యోతి):ఇటీవలమృతి చెందిన మూటాపురం గ్రామానికి చెందిన శ్యామలేటి సీతారావమ్మ భర్త ముత్తయ్యకు మంగళవారం పోస్టల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు బీమా నగదును అందజేశారు. మృతురాలు మూటాపురంలోని పోస్టాఫీస్‌లో బీమా చెల్లించేది. సీతారావమ్మ మృతి అనంతరం ఈసొమ్మును భరకు రూ.46వేలను అందచేశారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ నవ్య, సీడీసీ డైరెక్టర్ గుడిమళ్ళ మధు, సొసైటీ డైరెక్టర్ బొల్లినేని వెంకన్న, తెలంగాణ ఉద్యమకారుడు చావా రమేష్, కార్యదర్శి నాగస్వరూపరెడ్డి, టీడీపీ నాయకుడు కట్టా రాజేష్, కాంగ్రెస్ నాయకుడు నంబూరు ప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌కు సన్నద్ధం

- పారిశుధ్యం, పచ్చదనంపై ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ
- ప్రజలకు అవగాహనపై కమిషనర్ సమీక్ష

Swachh Survekshan Feedback Started

ens can give
edback via
r My City App,
hhata App &
R codes.
QR code / visit
n.org/feedback

ప్రజాభిప్రాయ సేకరణకు స్కానర్

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి4(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌సిటీ, పారిశుద్య నగరం వంటి అనేక అవార్డులను కైవసం చేసుకున్న ఖమ్మం నగరం... ఇప్పుడు స్వచ్ఛ సర్వేక్షన్ 2025 అవార్డును సాధించేందుకు సిద్ధమవుతోంది. పారిశుద్య చర్యలతో పాటుగా ప్రజల అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో సేకరించి అవార్డుకు ఎంపిక చేస్తారు. అయితే అవార్డు దక్కించుకునేందుకు కావాల్సిన పారిశుద్య, పచ్చదనం వంటి సంపూర్ణస్థాయి ఖమ్మం నగరానికి ఉంది. ఇప్పుడు కావాల్సింది ప్రజలు అభిప్రాయాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయటమే. చైతన్యవంతమైన ఖమ్మం ప్రజలు మంచిగా ర్యాంకింగ్ ఇచ్చి స్వచ్ఛ సర్వేక్షన్ 2025 అవార్డు సాధించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

5శాతం మార్కులు

స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేలో పాల్గొనే వారు ఆన్‌లైన్‌లో ఎస్‌బీఎంయూఆర్-బీఏఎన్.ఓఆర్‌జీ వైబ్ సైట్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది. తర్వాత ఫీడ్ బ్యాక్‌ను ఎంచుకొని ర్యాంకింగ్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. లేదా స్వచ్ఛసర్వేక్షణ్ స్కానర్ ద్వారా అభిప్రాయాలు తెలపవచ్చు.మొత్తం 10 అంశాలపై అభిప్రాయాలు తెలపాల్సి ఉంటుంది.

ర్యాంకింగ్‌లో అడిగే అంశాలు ఇలా..

మురికి కాల్వలు నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్లు నిర్వహణ, పొడిచెత్త, తడి చెత్త సేకరణ, కమర్షియల్ ప్రాంతాల్లో చెత్త సేకరణ, రహదారుల శుభ్రం, మీ ప్రాంతంలో చెత్త శుభ్రం చేస్తున్నారా.. స్వచ్ఛ ఆటోలు చెత్త సేకరణ, మార్కెట్‌లు, పార్కులు, బహిరంగ ప్రదేశాలు పరిశుభ్రంగా ఉంచటంలో అధికారుల పనితీరు, చెత్తకేంద్రాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన, సెప్టిక్ ట్యాంక్‌ల నిర్వాహకులు, మున్సిపల్‌శాఖలో అనుమతి పొందిన వారే ఉంటున్నారా.. మీరు ఎప్పుడైనా పారిశుద్య సమస్యలు అధికారులు దృష్టికి తీసుకెళ్లారా.. వారు ఎలా స్పందించారు. అనే అంశాలపై ప్రజల తమ అభిప్రాయాలను తెలపాల్సి ఉంటుంది.

క్షేత్రస్థాయిలో అవగాహనకు సమావేశం

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు, ప్రజల అభిప్రాయ సేకరణపై మంగళవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజలకు వెబ్‌సైట్ వివరాలు తెలపటం, యువతకు అవగాహన కల్పించటం వంటి అంశాలపై పారిశుద్య, ఎన్వీరాన్‌మెంట్, ఇతర విభాగాల అధికారులకు మార్గదర్శకం చేశారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలిగా పని చేస్తున్న కె.విజయలక్ష్మీకి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షల విభాగం కోఆర్డినేటర్ డాక్టరేట్ డిగ్రీ ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. 'ఎక్స్ పేట్రియట్ ఎక్స్ పీరియన్స్ ఇన్ ఝంపాలహరీస్ ఫిక్షన్ ఏ క్రిటికల్ స్టడి' అంశంపై పరిశోధనా గ్రంథానికి ఈ డాక్టరేట్ అందజేశారు.

8న నాగేశ్వరరావు విగ్రహ ఆవిష్కరణ

తిరుమలాయపాలెం, మార్చి4 (ఆంధ్రజ్యోతి):ఈనెల 8న పిండిప్రోలులో రాయల నాగేశ్వరరావు విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం పిండిప్రోలులో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. రాయల నాగేశ్వరరావు సర్పంచ్‌గా ఎంపీటీసీగా పనిచేసిన కాలంలో అవినీతి, పక్షపాతం లేకుండా పార్టీలకతీతంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.

మాదిగ అమరులకు ఘన నివాళి

నేలకొండపల్లి,మార్చి4(ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణను సాధించి తీరుతామని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు వంగూరి ఆనందరావుమాదిగ స్పష్టం చేశారు. మాదిగ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గువ్వలగూడెంలో నిర్వహించిన మాదిగ అమరుల సంస్మరణ దినోత్సవానికి హాజరయ్యారు. వర్గీకరణ అంశంపై సమగ్ర చర్చ లేకుండా ఆఘమేఘాల మీద శాసనసభలో ఆమోదించటం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో వంగూరి ఉపేందర్, వంగూరి గంగాధర్, మండల అధ్యక్షుడు మాదాసి వెంకన్న, రూరల్ అధ్యక్షుడు సిరిపురపు బొందయ్య, నాయకులు బోయిన కృష్ణ, మాతంగి నర్సింహారావు, వంగూరి నాగమ్మ, మాతంగి సరోజిని, శ్రీనాధ్, నాగరాజు, వీరబాబు, రమణ, నాగమ్మ పాల్గొన్నారు.

సీపీఎం నాయకురాలు కమలమ్మ కన్నుమూత



నేలకొండపల్లి, మార్చి4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూటాపురం గ్రామానికి చెందిన సీనియర్ సీపీఎం నాయకురాలు చావా కమలమ్మ(96) మంగళవారం ఉదయం మృతి చెందారు. కమలమ్మ మృతి సమాచారం తెలుసుకున్న సీపీఎం శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మృతదేహానికి నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్ కమలమ్మ మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు బండి రమేష్, ఏలూరి రంగారావు, ఇంటూరి అశోక్, గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు గుడిమళ్ళ మధు, బొల్లినేని వెంకన్న తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లు పూర్తి

తిరుమలాయపాలెం, మార్చి4(ఆంధ్రజ్యోతి): నేడు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వాహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. బుధవారం జరిగే ఇంటర్ పరీక్ష నిర్వాహనకు మండలంలోనిపిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల, తిరుమలాయపాలెంలోని కేజీబీవీ కళాశాలలో సెటర్లు ఏర్పాటుచేశారు. పిండిప్రోలు కళాశాలలో 174మంది పరీక్షకు హాజరవుతుండగా కేజీబీవీలో 115మంది పరీక్ష రాయనున్నారు. అలాగే 15మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరుకాన్నారు.

నేలకొండపల్లి: ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రాల వద్ద బుధవారం నుంచి 169 సెక్షన్ అమల్లో ఉంటుందని నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో జిరాక్స్ సెంటర్లు కానీ కిరాణా షాపులు కానీ తెరవకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సంతోష్ ప్రకటనలో హెచ్చరించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

ఖమ్మంరూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటి, ఖమ్మం రూరల్ మండలంలోని గ్రామాలకు సంబందించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు పరిశీలించారు. మొత్తం 15068 దరఖాస్తులు రాగా, అందులో ఒక్క ఏదులాపురం పంచాయతి నుంచి 6575 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వానికి 25 శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ చెల్లించాల్సి ఉంటుంది. లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

శాంతియుతంగా కల్యాణం జరుపుకోవాలి

కామేపల్లి,మార్చి4(ఆంధ్రజ్యోతి): శివుని కల్యాణాన్ని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి సూచించారు. మంగళవారం కామేపల్లి పోలీస్ స్టేషన్‌లో పండితాపురం గ్రామానికి చెందిన గ్రామస్థులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎలాంటి అలజడి సృష్టించినా కఠిన చర్యలతోపాటు నాన్‌బెయిల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వేసవిలో ప్రత్యేక శిక్షణ కోర్సులు

- అదనపు కలెక్టర్ శ్రీజ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి4(ఆంధ్రజ్యోతి): నైపుణ్య శిక్షణ కార్యక్రమాల అమలుకు పక్కా ప్రణాళిక రూపొందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. మంగళవారం ఆమె కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఉపాధి అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ అక్విజిషన్ అండ్ నాలెడ్జ్ అవేర్నెస్‌ఫర్ లైవ్లిహుడ్ ప్రమోషన్ (సంకల్ప్) కార్యక్రమంపై సంబంధితఅధికారులతో సమీక్షించారు.సంకల్ప్ కార్యక్రమ అమలుకు తీసుకోవాల్సిన కార్యాచరణపై అధికారులతో అదనపు కలెక్టర్ చర్చించి, పలు సూచనలు చేశారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా నైపుణ్య అభివృద్ధి, స్కిల్ డెవలప్మెంట్ క్రింద చేపట్టే కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలన్నారు. యువతకు ప్రస్తుత ట్రెండ్, డిమాండ్ ప్రకారం అవసరమైన కోర్సులలో శిక్షణ అందించేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. జిల్లాలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలపై ప్లాన్‌ఆఫ్ యాక్షన్ తయారు చేయాలని చెప్పారు. ఈసమావేశంలో జిల్లాఉపాధి అధికారి ఎన్. మాధవి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కె.సత్యనారాయణ,జిల్లా బీసీసంక్షేమ అధికారి జి.జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

11లోపు పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేయాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి4(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ కోరకు మార్చి 11లోపు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా పరిశ్రమల అధికారి టి. సీతారాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలవారి రూ.5వేల భత్యం, ఒకేసారి రూ.6వేలు మంజూరు చేస్తారని తెలిపారు. 12నెలల పాటు ఇంటర్న్‌షిప్‌లో కనీసం ఆరు నెలల ఉద్యోగ శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1800116090 ను సంప్రదించాలని తెలిపారు.



డీఐఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాటు చేసి వార్షిక పరీక్షలను అధికారులు పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబుని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ కోరారు. ఈ మేరకు మంగళవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాయకులు కలిసి పలు సమస్యలను వివరించారు. ఈనెల 5నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతున్న కారణంగా విద్యార్థులకు తాగునీరు, వైద్య, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. మాస్‌కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకొవాలని కోరారు. విద్యార్థుల అవసరాల మేరకు ఆర్టీసీ బస్సులను సమకూర్చాలని కోరారు. నాయకులు షేక్ నాగుల్‌మీరా, శివనాయక్, వంశీ, గోపీ, ప్రతాప్ పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

9న సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి టెండర్లు

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణానికి ఈనెల 9న టెండర్లు పిలుస్తామని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య హామీ ఇచ్చినట్లు రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం బాధ్యులు తెలిపారు. మంగళవారం కేఎంసీలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. సారంగపాణి, ఉపాధ్యక్షుడు మహిదర్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు షఫీ, వెంకటేశ్వర్లు, అథ్లెటిక్స్ కోచ్ గౌస్ పుష్పగుచ్ఛం అందించి సిథటిక్ ట్రాక్ పనులపై అడిగారు. దీంతో ఆయన ఈనెల 8న జిల్లాలో ఎలక్షన్ కోడ్ ఉన్నందున 9న టెండర్ల ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. 8 లైన్ల సింథటిక్ ట్రాక్ కోసం ప్రభుత్వం రూ. 8.5 కోట్లను మంజూరు చేసిందని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



టీషర్ట్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

'ఖమ్మం రన్నర్స్ క్లబ్' టీషర్ట్ ఆవిష్కరణ

ఖమ్మంస్పోర్ట్స్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రన్నర్స్‌క్లబ్ టీషర్ట్, లోగోను మంగళవారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో తహసీల్దార్లు దారా ప్రసాద్, తూమాటి శ్రీనివాస్, సీఐలు బాలక్రిష్ణ, బెల్లం సత్యనారాయణ తదితరులు ఆవిష్కరించారు. ఖమ్మంలోని ప్రజలు ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి, యువత ఆలోచన మాదక ద్రవ్యాల నుంచి మళ్లించే ముఖ్యఉద్దేశ్యంగా రన్నర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులను ఆర్థికంగా ప్రోత్సహించే బాధ్యత సైతం రన్నర్స్‌క్లబ్ తీసుకుంటుందన్నారు. పేదరికంలో ఉన్న ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రరమంలో ఎస్సైలు రామక్రిష్ణ, వెంకటక్రిష్ణ, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, రన్నర్స్ క్లబ్ సభ్యులు పిల్లి రాజు, గోపి, ఇబ్రహీం, రవీ, అన్వేష్, కృష్ణ, రామక్రిష్ణ దేవేందర్ తదితరులు ఉన్నారు.



పరీక్ష సామగ్రి అందజేస్తున్న కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ఖమ్మంవ్యవసాయం, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 36వడివిజన్ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు సహకారంతో మంగళవారం నగరంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన ఎలాంటి సహకారం అయినా తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చారు. ఉమెన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మంచి మార్కులను సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈకార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి హెచ్చ కృష్ణమోహన్, ప్రముఖ వ్యాపారవేత్త సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, వినోద్, మనోజ్, మహేష్, త్రినాథ్ ,సంగీత్, సింధు,పూజిత,శ్రీలత, శ్రీజ,స్వాతి, భవాని, నిత్య పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు: జేడీఏ

చింతకాని, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సాగర్ ఆయకట్టు పరిధిలో చివరి భూముల వరకు సాగునీరు అందిస్తామని జేడీఏ ధనసారి పుల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సాగునీటి సరఫరాపై రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర, ఏవో మానస, ఏఈవోలు రాము, తేజ, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో...

ఎర్రుపాలెం, మార్చి4(ఆంధ్రజ్యోతి):మండలంలోని మామునూరు గ్రామంలో నీటి ఎద్దడికి గురవుతున్న వరి, మక్క పంటలను జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య, మధిర డివిజన్ ఏడీఏ స్వర్ణ విజయచంద్రంతో కలిసి మంగళవారం పరిశీలించారు. నీటి ఎద్దడి సమస్యను ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏవో బి.సాయిశివ, ఇరిగేషన్ డీఈ సాంబశివరావు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం మృతికి నివాళి

చింతకాని, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొదుమూరు గ్రామ ఏఎన్ఎం-2 అందె ఝాన్సీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆశా కార్యకర్తల సమావేశంలో మృతురాలికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎండీ అల్తాఫ్, సాయికుమార్, సూపర్‌వైజర్‌లు రేచల్‌రాణి, వీరేందర్, నాగేశ్వరరావు, కృష్ణారావు, సైదులు, ఉదయ్‌కుమార్, సునీల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పొద్దుటూరులో బొడ్రాయి ప్రతిష్ఠ

చింతకాని, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో రేపు శ్రీ విజయశీతలా మహాచక్ర దివ్యజీవ నాభిశిలా (బొడ్రాయి), ముత్యాలాంబ తత్పరివార దేవతా ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

వైరా, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకుగానూ వైరా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 8ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు వైరా సబ్‌స్టేషన్‌లో 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌కో డీఈలు బండి శ్రీనివాసరావు, భద్రు పవర్ ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఏడీఈ పి.కిరణ్‌కుమార్, ఏఈలు పి.సుందర్‌కుమార్, పి.వెంకటసాయి, బోజ్యానాయక్ పాల్గొన్నారు.

'ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి'

మధిర రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని దెందుకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్ సూచించారు. మంగళవారం దెందుకూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ లంకా కొండయ్య, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రవన్న వర్ధంతి సభను జయప్రదం చేయండి

తల్లాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విప్లవకారుడు రాయల సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి సభను జయప్రదం చేయాలని మాస్‌లైన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్.లాల్ మియా కోరారు. మంగళవారం తల్లాడలో ప్రజాపంథా ఆధ్వర్యంలో ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 9న ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో రవన్న వర్ధంతి సభ జరుగుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, నాయకులు రామకృష్ణ, రాఘవ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పైకి వచ్చిన ట్రాక్టర్ సీజ్

చింతకాని, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చింతకాని మండలం రామకృష్ణాపురం రైల్వే గేటు సమీపంలో సోమవారం మధ్యాహ్నాం సమయంలో మద్రాస్ నుంచి హజ్రాత్ నిజాముద్దీన్ వెళ్తున్న దురంతో ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో ప్రమాదం తప్పిన విషయం తెలిసిందే. రైల్వే గేటు మూసి ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా రైల్వే ట్రాక్‌పైకి ఇసుక ట్రాక్టర్ వెళ్లిన ఘటనకు సంబంధించి లోకో పైలెట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముదిగొండ మండలం గంధసిరి గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను మంగళవారం సీజ్ చేసి, ట్రాక్టర్ యాజమాని, డ్రైవర్‌కు ఇరువురికి నోటీసులు ఇచ్చినట్లు ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

చింతకాని, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన మేడారపు రామకృష్ణ అనే వ్యక్తి ఫిబ్రవరి 17వ తేదీ అదృశ్యమైనట్లు ఆయన భార్య ధనమ్మ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విజయవాడ వెళుతున్నట్లు చెప్పి బయటకు వెళ్లిన రామకృష్ణ తిరిగి రాలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిష్టారం సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

» సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి



కిష్టారంలో దీక్ష వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, మార్చి4 (ఆంధ్రజ్యోతి): కిష్టారం సమస్యపై ఇప్పటికే కలెక్టర్‌తో మాట్లాడామని, అధికారులు, ప్రజాప్రతినిధులమంతా కలిసి చర్చించి మీకు తగిన న్యాయం చేస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి హామీ ఇచ్చారు. 23రోజులుగా సత్తుపల్లి మండలం కిష్టారంలో గ్రామస్థులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆమె సందర్శించి మద్దతు తెలిపారు. ఇదే విషయమై ముగ్గురు మంత్రులు, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు సింగరేణిలో వాటా ఉన్నందున కేంద్రంతో మాట్లాడి రావాల్సిన నష్టపరిహారానికి అదనంగా ఇప్పించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ఆయా నిధులతో నిర్మిస్తున్న నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించే బాధ్యత మనపైనే ఉందన్నారు. పాఠశాలకు ఆర్ఓఆర్ ప్లాంట్, మరమ్మతుల నిమిత్తం రూ.కోటి ఇస్తామని సింగరేణి సంస్థ ఇది వరకే చెప్పగా ఇంకా మంజూరు చేయలేదని గుర్తుచేశారు. సింగరేణి డీఎంఎఫ్‌టీ నిధులు ఈ ఏడాది రాలేదని అన్నారు. గత ప్రభుత్వం రావాల్సిన నిధులు పదేళ్లలో వారే స్వాహా చేశారని, వాడుకుని, వాళ్లకు కావాల్సిన చోట ఇచ్చుకుని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పుడు ప్రజలపైనే రూ.7లక్షల కోట్ల అప్పుఉందని ప్రతిపక్షం ప్రచారం చేస్తుందని, సింగరేణి సంస్థ ఇప్పుడు లాభాల్లో లేదని, డిప్యూటీ సీఎం భట్టి, సీఎండీ తనకు చెప్పారని, కాస్త సంయమనం వహిస్తే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ తర్వాత న్యాయం చేసే అవకాశం ఉంటుందని హామీ ఇచ్చారు. ముగ్గురు మంత్రులు హామీ ఇచ్చారని, మీకు తగిన న్యాయం జరిగే వరకు విశ్రమించనని, తనపై నమ్మకం ఉంచాలని, దీక్షలను కొనసాగించాలా, లేదా విరమించాలా అనే విషయాన్ని మీరంతా మాట్లాడుకోవాలని కోరారు. వెలువడే కాలుష్యం, ప్రజల ఆరోగ్యంపై తాను స్వతహాగా డాక్టర్‌ను కావడంతో తన పరిశీలనలో ఉందని, సింగరేణి సంస్థతో మాట్లాడానని, వారు సైతం కాలుష్యం రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఎం డలు ముదురుతున్న నేపథ్యంలో దీక్షలపై ఓ ఆలోచనకు రావాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు, నాయకులు ఉన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

» అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

బోనకల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బోనకల్ మేజర్‌కు విడుదలయ్యే సాగర్ జలాలతో రైతుల పొలాలన్నీ తడిచేలా అధికారులు సమన్వయం తో పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి కోరారు. బోనకల్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వృథా జరగకుండా రైతుల భూములకు నీరందించే విధంగా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రెగ్యూలైజ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి యాజమాన్య నిర్లక్ష్యం దిగ్భ్రాంతికరం : నంబూరి

సత్తుపల్లిరూరల్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): సైలో బంకర్‌తో విపరీతంగా వచ్చే దుమ్మూధూళితో కిష్టారం గ్రామంలోని ప్రజారోగ్యంపై తీవ్రప్రభావం చూపుతుండగా సింగరేణి యాజమాన్య నిర్లక్ష్యం దిగ్భ్రాంతికరమని బీజేపీ నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, భాస్కర్ల వీరంరాజు, ఈవీ.రమేష్‌లు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామానికి, నేషనల్ హైవేకు అతి సమీపంలో సైలో బంకర్‌ను నిర్మించడానికి అనుమతులు ఎలా ఇచ్చారని, దీనికి బాధ్యులు ఎవరు అని ప్రశ్నించారు. ఇదే విషయమై కేంద్రమంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డి, భూపేందర్‌యాదవ్‌ల దృష్టికి తీసుకెళ్లి విజిలెన్స్ విచారణ జరిపించి ప్రజలకు న్యాయం చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో మట్టా ప్రసాద్, సుదర్శన్‌మిశ్రా, నాయుడు రాఘవరావు, పడిగల మధుసూదన్‌రావు, పాలకొల్లు శ్రీనివాస్, బాణోత్ విజయ్, నాగస్వామి, రాంబాబు తదితరులున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలి మృతి



కిరణ్మయి (ఫైల్)

దమ్మపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న కిరణ్మయి (37) కొత్తగూడెం ప్రైవేటు వైద్యశాలలో చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి గుండెపోటుతో చెందారు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్సపొందుతుంది. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఆమెకు ఒక్క సారిగా గుండెపోటు రావడంతో మృతి చెందింది. నాగుపల్లి ప్రాథమిక పాఠశాలలో 2024 నుంచి ఉపాధ్యాయు రాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె స్వస్థలం సత్తుపల్లి మండలం కిష్టాపురం. ఈమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇంటి పన్నుల లక్ష్యాలను సాధించాలి

» డీపీవో ఆశాలత

కల్లూరు, మార్చి4 (ఆంధ్రజ్యోతి) ఇంటి పన్నుల లక్ష్యాలను నూరు శాతం సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత కోరారు. మంగళవారం కల్లూరులో కల్లూరు, తల్లాడ మండలాల స్థాయిలో ఇంటి పన్నుల వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్నుల లక్ష్యాలను ఈ నెల 20 తేదీ నాటికి నూరుశాతం లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవోలు సురేష్‌బాబు, ఈవోలు కృష్ణారావు, నాగేశ్వరరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఫిర్యాదు

మధిర రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మహదేవపురం ఏటి నుంచి అభివృద్ధి కార్యక్రమాల ముసుగులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆగ్రామస్థులు మంగళవారం మధిర రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ట్రెయినీ ఐపీఎస్ రిత్విక్ సాయి మహదేవపురం గ్రామానికి వెళ్లి ఇసుక కుప్పలను పరిశీలించారు. కొద్దిరోజుల క్రితం తహసీల్దార్ రాంబాబు సీజ్ చేసిన ఇసుకను బయటకు తరలిస్తుండగా ఫిర్యాదు చేశామని గ్రామస్థులు వివరించారు. రూ.లక్ష విలువ చేసే ఇసుక కుప్పలను రూ.23వేలకే ఎలా వేలంపాటగా ఇస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కలకా సుందర్‌రావు, కనపర్తి వినోద్, జినుగు రాంబాబు, కనపర్తి గోపాలకృష్ణ, రాజకుమారి దంపతులు సమస్యను పోలీసు అధికారులకు వివరించారు.

వైరాలో ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడి పర్యటన



వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైరాలో మంగళవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పర్యటించారు. మునిసిపాలిటీ ఏడో వార్డులో కామా ప్రవీణ్, ఉషారాణి దంపతుల కుమారుడు సార్విన్ అన్నప్రాశన వేడుకల్లో వారు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అదే విధంగా దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి, 9వ వర్ధంతి వేడుకలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. వెంకటరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నివాళులర్పించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, కట్ల రంగారావు, సూరంపల్లి రామారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, పాలేటి నర్సింహారావు, పమ్మి అశోక్, ధార్న రాజశేఖర్, నాగరాజు, వీరయ్య, బీక్యా, శ్రీను, వెంకటేశ్వరరావు, ఆనందరావు, విఘ్నేష్, గోపి పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించాలి

» పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీఎచ్. శిరోమణి

చింతకాని, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా నిర్వహించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీఎచ్. శిరోమణి అన్నారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో నిర్వహించిన పీవోడబ్ల్యూ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మార్చి 8న మహిళలపై జరుగుతున్న దాడులు, పరువు హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా సభలు ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల మంగతాయి, ప్రతాపనేని శోభ, కొల్లేటి వసంత, కారుమంచి సుజాత, షేక్ హుస్సేన్‌బీ, జొన్నలగడ్డ వెంకట్రావమ్మ, మొర్రిమేకల చుక్కమ్మ, చిర్రా భారతి పాల్గొన్నారు.

నాగరాజు కుటుంబానికి అండగా ఉంటాం

» ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు

సత్తుపల్లిరూరల్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట పోలీసుల చిత్రహింసలకు గురై సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కలపాల నాగరాజు కుటుంబానికి ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని ఆసంఘం జాతీయ కోర్ కమిటీ సభ్యుడు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. మంగళవారం బాధితుడిని పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గొల్లమందల ముత్తారావు, నల్లంటి అశోక్, దువ్వూరు రమేష్, గోళ్లమూడి శ్రీనివాసరావు, తడికమళ్ల దేవదాసు, పరిగడపు లక్ష్మణ్, సింగపోగు రాంబాబు, గోళ్లమూడి మారేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై 25శాతం రాయితీ

» మునిసిపల్ కమిషనర్ చింతా వేణు

వైరా, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటిస్థలాల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) కోసం మార్చి 31వతేదీలోగా ఫీజు చెల్లించిన వారికి ఫీజులో 25శాతం రాయితీ లభిస్తుందని వైరా మునిసిపల్ కమిషనర్ చింతా వేణు తెలిపారు. టౌన్‌ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్‌తో ఎల్ఆర్ఎస్‌పై కమిషనర్ మంగళవారం సమీక్షించారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తు వివరాలను సిటిజన్ లాగిన్‌లో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. మునిసిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేశామని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న మోదీ ప్రభుత్వం

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు

కొణిజర్ల, మార్చి4(ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్న మోదీ ప్రభుత్వం కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుతుందే తప్పా వాస్తవానికి ప్రజలకు చేసింది ఏమిలేదని సీపీఐ జాతీయసమితి సభ్యుడు భాగం హేమంతరావు విమర్శించారు. మండల పరిధిలోని తనికెళ్లలో మంగళవారం నిర్వహించిన గడల సీతారామయ్య 48వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీతారామయ్య ఆశయాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో గడల సీతారామ య్య కుమారుడు ఎస్టీయూ నాయకులు గడల భాస్కర్, సీపీఐ సీనియర్ నాయకులు గడల చిన్న సీతారామయ్య, గ్రామ శాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరావు, ఎస్టీయూ జిల్లా నాయకులు కొనపర్తి విష్ణుమూర్తి, సీపీఐ జిల్లా నాయకులు యర్రాబాబు, దొండపాటి రమేష్, పీవీరావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

పీఆర్టీయూ సంబురాలు



సత్తుపల్లిలో సంబురాలు నిర్వహిస్తున్న పీఆర్టీయూ నాయకులు


సత్తుపల్లిరూరల్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పక్షానా నిలబడే సంఘానికే పూర్తి మద్దతు ఎప్పుడూ ఉంటుందని ఆసంఘ మండల శాఖ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. శాసనమండలి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్టీయూ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి అఖండ మెజార్టీతో గెలిచిన సందర్భంగా మంగళవారం సత్తుపల్లి ప్రాంతీయ కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రత్నరాజు, పిల్లి సురేష్, రియాజ్, రవీంద్రరెడ్డి, ప్రసాద్, రవికుమార్, చెన్నకేశవరెడ్డి, లక్ష్మణాచారి, యేసురత్నం పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో...

ఎర్రుపాలెం, మార్చి4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఎర్రుపాలెంలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఆసంఘం మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పింగలి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించడంతో మంగళవారం సంబురాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.మదన్‌మోహన్‌రెడ్డి, ఎం.బాబురావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగా గురునాధరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.సంగిరెడ్డి, జిల్లాకార్యదర్శి వి.నాగరాజు , రాఘవరావు, నాగభూషణంరెడ్డి, సుమన, తదితరులు పాల్గొన్నారు.

పంటలను కాపాడాలి

మధిర రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సాగర్‌జలాలు అందక చివరి భూముల పంటపొలాలు ఎండిపోతున్నాయని మధిర డివిజన్‌లోని చెరువులను నింపి పంటలను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. మంగళవారం మధిర బోడేపూడి భవన్‌లో జరిగిన సీపీఎం పార్టీ నియోజకవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. రైతాంగ సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సాగర్‌నీళ్లు అందక రైతులు మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మిర్చి, పత్తి రైతులకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారని, ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, బండి పద్మ, శీలం నర్సింహారావు, దొండపాటి నాగేశ్వరరావు, మందా సైదులు, పడకంటి మురళీ, మద్దాల ప్రభాకర్, దివ్వెల వీరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతినేని, నున్నా

ఫేస్ అథెంటికేషన్‌పై అవగాహన



మాట్లాడుతున్న రాంగోపాల్‌రెడ్డి

కల్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్టర్ అయిన చిన్నారుల ఫేస్ అథెంటికేషన్ తప్పని సరి అని ఐసీడీఎస్ జిల్లా సంక్షేమ అధికారి కీసర రాంగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో చిన్నారులకు ఫేస్ అథెంటికేషన్‌పై ఎస్వోలకు ఆయన అవ గహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన చిన్నారులకు తప్పనిసరిగా ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

ఈ సందర్భంగా ప్రాజెక్టులో పనిచేస్తున్న సూపర్‌వైజర్ వెంకటమ్మకు గ్రేడ్ వన్ రెగ్యులర్ సూపర్‌వైజర్ ఆర్డర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి సీహెచ్. నిర్మల జ్యోతి, ఏసీడీపీవోలు రత్నమ్మ, మోహరున్నీసాబేగం, నవ్య, యూడీసీ శివరామకృష్ణ, ఎల్‌డీసీ విష్ణు, సూపర్‌వైజర్‌లు సుజాత, సంధ్యారాణి, భవానీ, వెంటకమమ్మ, సత్యవతి, రోజా, రత్నకుమారి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నమూనా పరిశీలన

వైరా, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైరా రెవెన్యూ కార్యాలయ ఆవరణంలో చేపట్టిన ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణాన్ని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మంగళవారం పరిశీలించారు. నమూనా ఇందిరమ్మ ఇంటిని ప్రజలు పరిశీలించి, త్వరితగతిన అర్హులైన వారు ఇళ్లు నిర్మించుకునేందుకు సౌకర్యంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

'రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించాలి'

సత్తుపల్లి, మార్చి4 (ఆంధ్రజ్యోతి): ఎప్పటిలాగే రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ కళాశాల విద్యార్థినీలు ర్యాంకులు సాధించాలని ఆషా స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మెరిట్ సాధించిన విద్యార్థినీలకు రూ.10వేల విలువైన నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అనంతరం యువసేవా సమితి ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లను దయానంద్ చేతులమీదుగా అందజేసి, నిర్వాహకులు రాజును అభినందించారు.

ఏపీఎంపై చర్యలు తీసుకోవాలి

కల్లూరు, మార్చి4 (ఆంధజ్యోతి): వీవోఏలపై అసభ్య పదజాలంతో దూషిస్తూ వేధింపులకు పాల్పడుతన్న ఏపీఎంపై విచారించి చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ ఆర్. శివరామకృష్ణలు కోరారు. కల్లూరులో వేము నాగమణి అధ్యక్షతన మంగళవారం జరిగిన వీవోఏల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న వీవోఏలపై గత రెండు నెలలుగా ఏపీఎం ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, దామాల దయాకర్‌రావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ సృజన టెస్టు కార్యక్రమం

మధిర రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఖాజీపురం వద్దగల ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి టెక్నికల్ సృజన టెస్టు-2024-2025 మంగళవారం నిర్వహించినట్లు పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సాంబయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్, సెక్రటరీ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో మెకానికల్ డిపార్టుమెంట్ విజయలక్ష్మి, వర్క్‌షాపు సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సత్తుపల్లిలో 3,143 మంది..

సత్తుపల్లిరూరల్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి నిర్వహించే ఇంటర్మీడియేట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరం 1,687, ద్వితీయ సంవత్సరం 1,456మంది మొత్తం కలిపి 3,143మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.

వైరాలో..

వైరా, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైరాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల, తెలంగాణ బాలికల గురుకుల జూనియర్ కళాశాల, మధు జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

కారేపల్లిలో..

కారేపల్లి, మార్చి4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ మోడల్ పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పరీక్షల నిర్వహణ అధికారి ఓరుగంటి వనతి తెలిపారు.

ముదిగొండలో...

ముదిగొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ప్రథమ సంవత్సరంలో 174మంది, ద్వితీయ సంవత్సరం 145మంది పరీక్షలకు హాజరుకానున్నారని ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు.

'పది' విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల వితరణ

కల్లూరు, మార్చి4 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు భూపాలపల్లి జిల్లా పౌర సంబంధాల అధికారి ఉబ్బన శ్రీనువాసరావు తన తల్లి జ్ఞాపకార్థంగా పెన్నులు, ప్యాడ్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కల్లూరు, పేరువంచ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాసరావు పాల్గొని వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యస్‌కే మౌలాలి, వరక రామారావు, సీఆర్పీలు యాలాద్రి రాము, బాబురావు, రామకృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల ముందుస్తు అరెస్ట్

చింతకాని, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చింతకాని గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లను మంగళవారం ముందస్తు అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వేతనాలను పెంచాలనే డిమాండ్‌తో ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి హైదరాబాద్ వెళ్తుండగా ముగ్గురు అంగన్‌వాడీ టీచర్లను ముందస్తుగా అరెస్ట్ చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

బీటెక్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కొణిజర్ల, మార్చి4(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ విడుదల చేసిన బీటెక్ థర్డ్ ఇయర్ ఫలితాల్లో స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ చిన్నయ్య, వైస్‌ప్రిన్సిపాల్ ఆయేషాతరుణం, అధ్యాపకులు అభినందించారు.

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

వైరా, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ పిలుపునిచ్చారు. వైరాలో మచ్చా మణి అధ్యక్షతన మంగళవారం జరిగిన ఐద్వా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలుచేయాలని కోరారు. మహిళా దినోత్సవ సభలో ఐద్వా కార్యక్రమాలను నిర్ణయిస్తామని తెలిపారు. గుడిమెట్ల రజిత, తోట కృష్ణవేణి, మల్లికాంబ, ప్రమీల, విజయ, కళావతి, సాయిలక్ష్మి, తోట పద్మావతి పాల్గొన్నారు.

కల్లూరులో లైన్‌మన్ డే ఉత్సవాలు

కల్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని విద్యుత్ ఉపకేంద్రంలో మంగళవారం ఘనంగా లైన్‌మన్ డే ఉత్సవాలను విద్యుత్ అధికారి వెంకట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా కల్లూరు ఉపకేంద్రంలో పని చేస్తున్న సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఎల్. రవి, లైన్ ఇన్‌స్పెక్టర్స్ బత్తుల సత్యనారాయణ, ఎం. ఉస్మాన్ బేగ్, లైన్‌మన్ శ్రీను, మురళి, రమేష్, రవి, జాన్, బిల్లుకలెక్టర్లు కిరణ్, రాజారావులను విద్యుత్ అధికారి వెంకట్, సబ్ ఇంజనీర్ గురునాథంలు శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి చిత్రపటానికి క్షీరాభిషేకం

ముదిగొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలో ఇప్పటివరకు పలు అభివృద్ధి పనులకు రూ.290కోట్ల నిధులు మంజూరు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చిత్రపటానికి మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 14నెలల్లోనే ముదిగొండ మండల అభివృద్ధికి రూ.290కోట్లు కేటాయించటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు సుందర్‌రావు, పసుపులేటి దేవేంద్రం, వెంకటేశ్వరరావు, అంజయ్య, కృష్ణ, మల్లెల అజయ్, రాంబాబు, రవీందర్‌రెడ్డి, వినోద్, అజ్గర్, పసుపులేటి వెంకట్, ఐనాల శ్రీను, రమేష్ పాల్గొన్నారు.